




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 325 | ది. 11-3-2026 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 325 | Date : 11-3-2026 | Tuesday | Pages : 8 | Rs.1/- |


# రాష్ట్రంపై యుద్ధ ప్రభావం తగ్గించేలా చర్యలు

- పౌల్ట్రీ, హార్టీకల్చర్ రంగాల్లో సంక్షోభం తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ
- గల్ఫ్ దేశాల్లోని ప్రవాసాంధ్రుల క్షేమ సమాచారాలపై నిరంతరం ఆరా
- ఉగాదికి 2.50 లక్షల సామూహిక గృహ ప్రవేశాలు
- సీసీ కెమెరా నెట్వర్క్ ద్వారా నేర నియంత్రణ ప్రణాళిక
- రియల్ టైమ్ గవర్నెన్స్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష



**అమరావతి,మార్చి 10 (వార్తాప్రభ) :** ఇరాన్ యుద్ధ ప్రభావంపై ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ తగిన నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గల్ఫ్ దేశాలతో ఉన్న అన్ని అంశాలూ ప్రభావితం అయ్యే అవకాశం ఉంటుందని వాటి వల్ల సంక్షోభం తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో మంగళవారం వివిధ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎల్పీజీ, గుడ్లు, అరటి వంటి వాటి ఎలాంటి ప్రభావం ఉందోననే అంశంపై నిరంతరం పరిశీలించాలని సీఎం సూచించారు. యుద్ధ ప్రభావిత దేశాలతో పాటు ఇతర ప్రాంతాల్లో తెలుగు వారు ఉన్న చోట పరిస్థితిని ఎప్పటికప్పుడు గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. విదేశాంగ వ్యవహారాల శాఖతో సంప్రదించి ప్రవాసాంధ్రుల క్షేమంగా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దీనికి సంబంధించి రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రంతో పాటు ఉన్నతాధికారులు ఓ బృందంగా ఏర్పడి ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేయాలని సూచించారు. అంతకుముందు రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ పంపిణీ సంస్థలు అందిస్తున్న పౌర సేవలు, విద్యుత్ సరఫరా, పాఠశాల, ఉన్నత విద్య, ఇసుక సరఫరా లాంటి అంశాలపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. ప్రస్తుత ఏడాదిలో విద్యుత్ వినియోగం గరిష్టంగా 14,013 మెగావాట్లకు చేరుకుందని అధికారులు వివరించారు. విద్యుత్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఎనర్జీ ఆడిట్ నిర్వహించి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి డిస్కంలను ఆదేశించారు. ఈ విషయంలో వినియోగదారులకు పూర్తి సమాచారం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని డిస్కంలకు సూచించారు. అటు పాఠశాల, కళాశాల విద్యకు సంబంధించిన అంశాల్లో సిలబస్, మధ్యాహ్న భోజనం, పరిశుభ్రమైన తరగతి గదులు వంటి అంశాలపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తృణ ధాన్యాలతో చిక్కీ లాంటి పౌష్టికాహారం అందించే అంశాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టాలని అధికారులకు సూచించారు.

**డీజీసీఏ సహకారంతో డ్రోన్ పైలట్ ట్రైనింగ్ సెంటర్..**

ఉగాది రోజున 2.50 లక్షల మంది లబ్దిదారుల సామూహిక నూతన గృహ ప్రవేశ కార్యక్రమం చేపడుతున్నామని, వారికి ప్రభుత్వం తరపు నుంచి స్థానిక ప్రజాప్రతినిధులు అందించేలా అధికారిక లేఖ వెళ్లేలా చూడాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్దేశించిన ధరకే ఇసుక సరఫరా జరగాలని సీఎం స్పష్టం చేశారు. దీనిపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలని సీఎం సూచించారు. ఇటీవల ఢిల్లీలోని ఏఐ ఇంపాక్ట్ ఇండియా సమ్మిట్లో కుదుర్చుకున్న ఒప్పందాలు సాకారం అయ్యేలా త్వరితగతిన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుకు భారత్ జెన్, నెక్స్ జెన్, ఐబీఎం లాంటి సంస్థలు ముందుకు వచ్చాయని వచ్చే విద్యా సంవత్సరం నుంచే కోర్సులు ప్రారంభం అయ్యేలా చర్యలు చేపట్టాలని సీఎం అన్నారు. అటు కాలిబో సంస్థ ఏర్పాటు చేయదలచిన ఏఐ శాండ్ బాక్స్ వచ్చే నాలుగు నెలల్లో స్టార్టప్ ల కోసం అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. ఎన్విడియా సంస్థ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ తో భాగసామ్యం వహించేలా చూడాలని ఆయన ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతీ రైతుకూ సహకారం అందించేలా ఏఐ అగ్రానమిస్ట్, విద్యా బోధనకు సహకారం అందించేలా ఏఐ ట్యూటర్, ప్రాథమికంగా వైద్య సలహాలు అందించేలా ఏఐ డాక్టర్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. పేషెంట్ ప్రిస్క్రిప్షన్ కూడా యాప్ ద్వారా వచ్చేలా చూడాలన్నారు. సీసీ టీవీ యాప్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 14 వేల సీసీ కెమెరాలను అనుసంధానించి నేర నియంత్రణ చేపట్టేలా చూడాలన్నారు. నేరస్థులను గుర్తించి నేరాలకు అడ్డుకట్టే వేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీని త్వరితగతిన అందుబాటులోకి తేవటంతో పాటు డ్రోన్ ఫ్లైయింగ్ ట్రాక్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. రిమోట్ పైలట్ ట్రైనింగ్ సెంటర్ కూడా ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలన్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ సహకారంతో అత్యుత్తమ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఏటీసీ తరహాలోనే డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థను కూడా రూపొందించాలన్నారు. వాట్సప్ గవర్నెన్సు వినియోగం మరింత పెంచేలా పౌరులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టాలని సీఎం సూచించారు. ఈ సమీక్షకు మంత్రి కొలుసు పార్థసారధి, సీఎస్ సాయి ప్రసాద్, ఐటీ, ఆర్టీజీఎస్, గనులు, విద్య, ఆర్థిక, ప్రణాళిక శాఖల అధికారులు హాజరయ్యారు.

# ప్రభుత్వానికి తలవంచని ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ : లోక్‌సభలో ప్రియాంక గాంధీ

- లోక్‌సభలో సోదరుడిని గట్టిగా సమర్థించిన ప్రియాంక గాంధీ
- నెహ్రూను విమర్శించే బీజేపీ నేతలే ఇప్పుడు ఆయన్ను ఉటంకిస్తున్నారని చురక
- స్పీకర్ ఓం బిర్లా తొలగింపు తీర్మానంపై చర్చ సందర్భంగా ఈ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,మార్చి 10 (వార్తాప్రభ) :** లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తన సోదరుడు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని గట్టిగా సమర్థించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి తలవంచకుండా నిలబడిన ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ అని ఆమె కొనియాడారు. మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలంటూ ప్రవేశపెట్టిన తీర్మానంపై జరిగిన చర్చలో ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు.సభకు అధ్యక్షత వహిస్తున్న ప్యానెల్ స్పీకర్ కృష్ణ ప్రసాద్ తెన్నేటి అనుమతితో ప్రియాంక మాట్లాడారు. ఈ సందర్భంగా అధికార పక్షంపై ఆమె చురకలు అంటించారు. "ప్రతిరోజూ నెహ్రూజీని విమర్శించే వారే, ఈ రోజు ఆయనను ఉటంకించడం చూసి నాకు నవ్వొచ్చింది. ఒక్కసారిగా వారికి నెహ్రూజీపై గౌరవం పుట్టుకొచ్చింది. ప్రజాస్వామ్యాన్ని అత్యంత బలోపేతం చేసింది నెహ్రూజీనే అని ఇప్పుడు చెబుతున్నారు" అని ప్రియాంక వ్యాఖ్యానించగా, ప్రతిపక్ష సభ్యులు బల్లలు చరుస్తూ మద్దతు తెలిపారు. అనంతరం రాహుల్ గాంధీని సమర్థిస్తూ, "గత 12 ఏళ్లుగా ఈ ప్రభుత్వం ముందు తలవంచని వ్యక్తి ఈ దేశంలో ఒక్కరే ఉన్నారు. ఆయనే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ. ఎందుకంటే లోక్‌సభ నాయకుడు నిజం మాట్లాడటానికి వెనుకాడరు. కానీ, వారు (ప్రభుత్వం) నిజాన్ని జీర్ణించుకోలేరు" అని ప్రియాంక అన్నారు. అంతకుముందు, స్పీకర్‌కు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు స్పందించారు. రాజ్యాంగం ప్రకారం చట్టాలు, నిబంధనలకు అధికార, ప్రతిపక్ష సభ్యులందరూ కట్టుబడి ఉండాలని అన్నారు. "ఏ వ్యక్తి అయినా తనను తాను అన్నింటికీ అతీతుడిగా భావించినప్పుడు, అతడిని నిలదీయడం చాలా ముఖ్యం" అని రాహుల్ గాంధీని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు.

# మార్చి 11,12 జిల్లా కలెక్టర్ల, ఎస్పీలతో సమీక్షా సమావేశాలు

- ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై కీలక సమీక్షలు
- కలెక్టర్ల కాన్ఫరెన్సులో దిశా నిర్దేశం చేయనున్న ముఖ్యమంత్రి
- సమావేశాల రెండో రోజున శాంతి భద్రతలపై సమీక్ష... హాజరుకానున్న జిల్లాల ఎస్పీలు



**అమరావతి,మార్చి 10 (వార్తాప్రభ) :** రాష్ట్ర అభివృద్ధి దిశగా పని చేస్తోన్న అధికార యంత్రాంగానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేసేలా ఈ నెల 11, 12 తేదీల్లో రెండు రోజుల పాటు కలెక్టర్ల సమావేశం జరగనుంది. రాష్ట్ర సచివాలయంలోని ఐదో బ్లాకులో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, జీఎస్డీపీ గ్రోత్, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాలు, మౌలిక సదుపాయాల కల్పన, శాంతిభద్రతలపై సమగ్రంగా చర్చించనున్నారు. కాన్ఫరెన్స్ మొదటి రోజు ఉదయం 10 గంటలకు సీసీఎల్ఏ స్వాగత ప్రసంగంతో ప్రారంభమవుతుంది. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ శాఖ మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. ఉదయం 10:30 గంటలకు ముఖ్యమంత్రి కీనోట్ అడ్రస్ ఇవ్వనున్నారు. అనంతరం వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్షించనున్నారు. స్వర్ణాంధ్ర ఏ2047 - పది సూత్రాల అమల్లో భాగంగా పేదరిక నిర్మూలన, నైపుణ్యాభివృద్ధి, జల భద్రత, వ్యవసాయ రంగంలో టెక్నాలజీ వంటి అంశాలపై చర్చించనున్నారు. రాష్ట్ర జి ఎస్ డి పి, జిల్లాల వారీగా సాధించిన లక్ష్యాలపై సమీక్షిస్తారు. ఇక డిజిటల్ గవర్నెన్సులో భాగంగా ఈ-ఆఫీస్ ఫైళ్ల పరిష్కారం, డేటా డ్రివెన్ గవర్నెన్స్, పెట్టుబడి ప్రతిపాదనల గ్రౌండింగ్‌పై అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు. సదస్సు రెండో రోజున ప్రజారోగ్యం, సంక్షేమ పథకాలపై ప్రత్యేక సమావేశంలో కీలక చర్చ జరగనుంది. దీంతో సూపర్ సిక్స్ పథకాల అమలు తీరు, మధ్యాహ్న భోజన పథకం, వేసవిలో తాగునీటి ప్రణాళికలపై ముఖ్యమంత్రి సమీక్ష చేపడతారు. అలాగే భూ పరిపాలన, రెవెన్యూ ఆర్జన శాఖల పనితీరుతో పాటు విద్య, ఉపాధి అవకాశాల కల్పనపై చర్చలు జరగనున్నాయి. రెండో రోజు సాయంత్రం వేళ రాష్ట్రంలోని శాంతిభద్రతలపై ప్రత్యేక సెషన్ ఉంటుంది. ఈ సెషనులో జిల్లా ఎస్పీలు హాజరుకానున్నారు. రాష్ట్రంలోని శాంతి భద్రతల పరిస్థితిపై డీజీపీ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ రెండు రోజుల సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, హెచ్వోడీలు పాల్గొననున్నారు.

# పర్యాటక అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- పర్యాటక ప్రాంతాలకు ప్రచారం కల్పించాలి
- ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు వెళ్లే దారుల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి
- పర్యాటక శాఖ బస్సులను నిరుపయోగంగా ఉంచరాదు
- స్పెషల్ ప్యాకేజీలు, ప్రత్యామ్నాయ రూట్ల ద్వారా ఆదాయాన్ని పెంచాలి
- రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి
- పర్యాటక కేంద్రాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలి
- పర్యాటక శాఖ సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్,మార్చి 10 (వార్తాప్రభ) :** తెలంగాణ పర్యాటక రంగాన్ని దేశంలోనే మేటిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. మంగళవారం హిమాయత్ నగర్ లోని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (టీజీటీడీసీ) కార్యాలయంలో సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వల్లూరి,ఇతర ఉన్నతాధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, పర్యాటక ఆస్తుల వినియోగం, ప్రాచుర్యం, ప్రచారం, ఆదాయ మార్గాలు, హరిత హోటళ్ల నిర్వహణ, పెండింగ్ పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రధాన పర్యాటక ప్రాంతాలలో సూచిక బోర్డులు, ఫుడ్ కోర్టులు, టూరిజం సమాచార కేంద్రాలు వంటి ప్రాథమిక సౌకర్యాల స్థితిగతులపై మంత్రి సమీక్షించారు. బోటింగ్ సౌకర్యాలు, కాటేజీలు, వ్యూ పాయింట్లు, హరితహోటళ్ల నిర్వహణను మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, పర్యాటకుల సంఖ్య పెరిగేలా, వారికి మరింత సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. ప్రపంచ పర్యాటక ముఖ చిత్రంలో తెలంగాణ కీలక స్థానంలో ఉండాలనే సీయం రేవంత్ రెడ్డి అకాంక్షలకు అనుగుణంగా పర్యాటక రంగ అభివృద్ధి, బ్రాండింగ్, ప్రమోషన్, ప్రచారం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసి తెలంగాణను ఆకర్షణీయమైన టూరిజం గమ్యస్థానంగా తీర్చిద్దేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని చెప్పారు. పర్యాటక ప్రచారంపై ఆయా రాష్ట్రాలు అవలంభిస్తున్న విధానాలను అధ్యయనం చేసి వాటికి ధీటుగా మన పర్యాటక ప్రాంతాలకు ప్రచారం కల్పించాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రముఖ పర్యాటక ప్రదేశాలకు పర్యాటకులు సులభంగా చేరుకునేలా సూచిక బోర్డులను (డైరెక్షన్ సైనేజ్) ఏర్పాటు చేయాలని, సాధ్యమైనంత త్వరగా వీటిని పూర్తి చేయాలన్నారు.


**మహారాజశ్రీ విజయవాడ ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

ఓ.ఎస్.నెంబర్. 682/2023

బిట్వీన్ :
ఐసిఐసి బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ
రిప్రజెంటెడ్ బై జిపిఏ హెూల్డర్, విజయవాడ
--------వాది

మరియు

రాంబాబు కొక్కిలిగడ్డ.
తండ్రి కె.నాగేశ్వరరావు,
నివాసం : డోర్ నెం.26-33-27,
ఎటి అగ్రహారం,ఎస్.బి.ఐ. పైన,
గుంటూరు-522004
--------ప్రతివాది

పై నెంబరు దావా నందు పైన తెలిపిన ప్రతివాదికి దావా సమన్లు అందజేయు నిమిత్తం ది.01-04-2026వ తేదీకి వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన ప్రతివాది వాయిదా రోజు ఉదయం గం.10.30ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు అయి వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని యెడల వారి పరోక్షమందు సదరు పై దావా తీర్మానము కాబడునని ఇందుమూలముగా తెలియచేయుటమైనది.

**(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము)**
**వాయిదా తేది : 01-04-2026**

ఇట్లు
**కునుకు రాజశేఖర్**
వాది తరపు అడ్వకేట్
గాంధీనగర్,
విజయవాడ-520003


# శ్రీసిటీని సందర్శించిన 'సోలుం' చైర్మన్


## - పెట్టుబడి అనుకూల వాతావరణంపై ప్రశంస




**తిరుపతి,మార్చి 10 (వార్తాప్రభ) :** శ్రీసిటీలో నిర్మాణ తుదిదశలో ఉన్న సోలుం ఇండియా హైటెక్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ పురోగతి సమీక్షలో భాగంగా సోలుం కంపెనీ లిమిటెడ్ చైర్మన్ & సీఈఓ సుంఘో జున్ మంగళవారం తొలిసారిగా శ్రీసిటీ సందర్శించారు. శ్రీసిటీ బిజినెస్ సెంటర్ వద్ద శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సుంఘో జున్‌కు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రపంచ స్థాయి తయారీ కేంద్రంగా ఎలా అభివృద్ధి చెందిందో వివరించారు. శ్రీసిటీ, సోలుం సంస్థ భాగస్వామ్యం భారతదేశంలో ఎలక్ట్రానిక్స్ తయారీ రంగం మరింత వేగంగా అభివృద్ధి చెందడానికి ఊతం ఇస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు.శ్రీసిటీ పెట్టుబడిదారుల అనుకూల విధానాలు, ఆధునిక మౌళిక సదుపాయాలు, సమర్ధ నిర్వహణను సుంఘో జున్ ప్రశంసించారు. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారం మరియు శ్రీసిటీ అందిస్తున్న సౌకర్యాలను ఆయన అభినందించారు.శ్రీసిటీలో 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.268 కోట్ల పెట్టుబడితో సోలుం ఇండియా హైటెక్ ప్రైవేట్ లిమిటెడ్ దేశంలో తన రెండవ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడటంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధి, నైపుణ్యాభివృద్ధికి దోహదం కానుంది.ఈ ప్లాంట్‌లో 3-ఇన్-1 టీవీ బోర్డులు, సర్వర్ పవర్ సప్లైలు, ఈవీ ఛార్జర్ భాగాలు, కంట్రోల్ యూనిట్లు, ఎలక్ట్రానిక్ షెల్ఫ్ లేబుల్స్ (జుహాం) వంటి ఆధునిక ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు తయారు చేయనున్నారు. దీంతో పవర్ మాడ్యూల్స్ మరియు ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ తయారీలో సోలుం సంస్థ గ్లోబల్ మార్కెట్ లో మరింత బలపడనుంది.

# భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా జగన్ పాలన సాగించాడు. : మంత్రి పార్థసారథి

- సిమెంట్ ధర పెంచి ప్రజలపై రూ.165 కోట్ల భారం మోపారని విమర్శ
- జగన్ చేసిన అప్పులకు ఏటా రూ.71,800 కోట్లు చెల్లించాల్సి వస్తోందని వెల్లడి
- వైసీపీ ఐదేళ్ల పాలనలో చేసిన ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే నిదర్శనమని వ్యాఖ్య
- కూటమి ప్రభుత్వంపై జగన్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని ధ్వజం




**గుంటూరు,మార్చి 10 (వార్తాప్రభ) :** గత ఐదేళ్ల జగన్ పాలనంతా సొంత కంపెనీలకు లబ్ధి చేకూర్చడం కోసమే సాగిందని, ముఖ్యంగా భారతి సిమెంట్ వ్యాపారాన్ని విస్తరించడమే లక్ష్యంగా పనిచేశారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో విమర్శించారు. సిమెంట్ ధరను కృత్రిమంగా పెంచి ప్రజాధనాన్ని తన కంపెనీకి మళ్లించారని, అదే సమయంలో తన మీడియా సంస్థ అయిన సాక్షికి వందల కోట్ల రూపాయల ప్రకటనలు ఇచ్చుకున్నారని ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జగన్ తన అధికారాన్ని పూర్తిగా దుర్వినియోగం చేశారని పార్థసారథి ధ్వజమెత్తారు. "రాష్ట్రానికి ఆదాయం తెచ్చే మార్గాలను గాలికొదిలేసిన జగన్, తన కంపెనీల ఆదాయానికి మాత్రం ఎలాంటి లోటు రాకుండా చూసుకున్నారు. భారతి సిమెంట్‌కు లబ్ధి చేకూర్చేందుకు సిమెంట్ బస్తాపై రూ.3 పెంచి, ప్రజలపై ఏకంగా రూ.165 కోట్ల భారం మోపారు. ఈ నిర్ణయంతో భారతి సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం మూడు రెట్లు పెరిగింది. మరోవైపు, సాక్షి పత్రికకు ప్రకటనల రూపంలో రూ.400 కోట్లకు పైగా కట్టబెట్టారు. ప్రత్యేక జీవోలు జారీ చేసి వాలంటీర్లు, సచివాలయ సిబ్బందితో బలవంతంగా సాక్షి పత్రికను కొనిపించారు. దీన్నిబట్టి ఆయన పాలన ఎవరి కోసం సాగిందో స్పష్టమవుతోంది" అని పార్థసారథి విమర్శించారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని, ఆయన సృష్టించిన ఆర్థిక విధ్వంసానికి కాగ్ నివేదికే సాక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో రాష్ట్రం మొత్తం రూ.9.70 లక్షల కోట్ల అప్పు చేసిందని, ఈ అప్పులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏటా రూ.71,800 కోట్లు అసలు, వడ్డీల రూపంలో చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఇప్పుడు అసెంబ్లీకి రాకుండా ఇంట్లో కూర్చుని, కూటమి ప్రభుత్వంపై జగన్ అసత్య ప్రచారాలు చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.87 వేల కోట్లు అప్పు చేసిందని దుష్ప్రచారం చేస్తున్నారు. కానీ కాగ్ నివేదిక ప్రకారం ఆ ఏడాదిలో మొత్తం అప్పు రూ.81 వేల కోట్లు. అందులో తొలి మూడు నెలలు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వమే రూ.27,025 కోట్లు అప్పు చేసింది. ఆ తర్వాత తొమ్మిది నెలల్లో కూటమి ప్రభుత్వం రూ.53 వేల కోట్లు మాత్రమే అప్పు చేసింది. జగన్ చేసిన అప్పులతో ఆస్తులు సృష్టించలేదు, కానీ మేం మూలధన వ్యయం కింద రూ.16 వేల కోట్లు ఖర్చుచేసి భవిష్యత్ తరాలకు ఆస్తులను అందిస్తున్నాం" అని పార్థసారథి వివరించారు.

**సంక్షేమం, అభివృద్ధిలో ముందున్నాం..** ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, సంక్షేమ పథకాల అమలులో రాజీ పడటం లేదని మంత్రి తెలిపారు. "జగన్ హయాంలో ఐదేళ్లలో అమ్మ ఒడికి రూ.26 వేల కోట్లు ఖర్చు చేస్తే, మా ప్రభుత్వం ఐదేళ్లలో రూ.35 వేల కోట్లు ఖర్చు చేయనుంది. సామాజిక పింఛన్లకు జగన్ రూ.58,500 కోట్లు ఖర్చు చేస్తే, మేం కేవలం 20 నెలల్లోనే రూ.58,654 కోట్లు చెల్లించాం. చంద్రబాబు నాయకత్వంపై నమ్మకంతో రాష్ట్రంలో మళ్లీ విశ్వసనీయత పెరిగింది. జగన్ పాలనలో వెళ్లిపోయిన కంపెనీలు తిరిగి పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. ఇప్పటికే 20 పారిశ్రామిక పాలసీలు తీసుకొచ్చి, 20 నెలల్లో రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. తద్వారా 6.50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం. ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే మా లక్ష్యం" అని ఆయన పేర్కొన్నారు. అన్నం పెట్టే రైతులను సైతం జగన్ మోసం చేశారని, ధాన్యం కొనుగోలు బకాయిలు రూ.1600 కోట్లు చెల్లించకుండా వెళ్ళిపోయారని పార్థసారథి మండిపడ్డారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తోందని తెలిపారు. పోలవరం, అమరావతి వంటి కీలక ప్రాజెక్టులను నాశనం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను పక్కదారి పట్టించి రాష్ట్రాన్ని ఐదేళ్లు వెనక్కి నెట్టిన జగన్, ఇప్పుడు ప్రజలను మభ్యపెట్టాలని చూడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

# ప్రజల చేతిలో పునర్నిర్మాణం!!

● రేవంత్ ప్రభుత్వం - అద్భుత పరిపాలన ● 800 కోట్లతో రామగుండం అభివృద్ధి వైభవం ● రాబోయే రెండేళ్లలో అద్భుత మార్పు ● ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మేయర్ మహంకాళి స్వామి





**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 10 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం నగరాన్ని స్వచ్ఛంగా, ఆకుపచ్చగా, అందంగా మార్చే లక్ష్యంతో ప్రతి పౌరుడూ చేతులు కలపాలని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ హృదయపూర్వకంగా పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం 38వ డివిజన్ పరిధిలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం వార్డు కౌన్సిలర్ నెలకంటి రాము ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, మేయర్ హాజరైనారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే....రేవంత్ రెడ్డి ప్రభుత్వం గత రెండేళ్లలో అభివృద్ధి-సంక్షేమ పథంలో అద్భుతమైన పనితీరు చూపిస్తోందని, రాజకీయాలకు అతీతంగా ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తోందని ప్రశంసించారు. నగరాన్ని పరిశుభ్రంగా, పచ్చని చెట్లు-ల్యాండ్‌స్కేప్‌లతో సౌందర్యవంతంగా తీర్చిదిద్దడమే ఈ ప్రణాళిక ముఖ్య ఉద్దేశ్యమని స్పష్టం చేశారు. మహిళల సాధికారతకు స్వశక్తి సంఘాల ద్వారా కోట్లాది రూపాయల సబ్సిడీ రుణాలు, ప్రభుత్వ రంగంలో లక్ష, ప్రైవేటు రంగంలో రెండు లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు వివరించారు. రామగుండం పునర్నిర్మాణం ఊపందుకుంటోందని, రోడ్ల విస్తరణ, వాణిజ్య భవనాల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. మరో రెండేళ్లలో నగరం అన్ని రంగాల్లో అద్భుతంగా మారి, బయటి ప్రాంతాల నుంచి ప్రజలను ఆకర్షించేలా రూపుదిద్దుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మేయర్ మహంకాళి స్వామి అందరినీ ప్రతిజ్ఞ చేయించి, సానిటేషన్‌కు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని, పారిశుద్ధ్య వ్యవస్థను మరింత మెరుగుపరుస్తున్నామని చెప్పారు. చెత్తను బయట పడవేసిన వారిపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే నాయకత్వంలో సుమారు 800 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, త్వరలోనే నగర రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతిపెల్లి ఎల్లయ్య, నగర పాలక సంస్థ అధికారులు, వార్డు మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం





**శేరిలింగంపల్లి ,మార్చి 10 (వార్తాప్రభ):** నల్లగండ్ల డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన ఎల్లమ్మ తల్లి కల్యాణం కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పల్లపు సురేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో రాజు నాయక్‌తో పాటు గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ తల్లి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

## సాయిరాం కాలనీలో సీసీ రోడ్డు పనులు పరిశీలించిన మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి.



**ఎల్బీనగర్/వార్తప్రభ(మార్చి 10):**బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాయిరాం కాలనీలో జరుగుతున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టి, కాలనీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. డివిజన్ అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తూ, కాలనీల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్య జనగామ!!

● ఒకే వేదికపైకి స్పెషలిస్ట్ వైద్యులు ● పేదలకు అండగా ప్రజా-పాలన ● 6వ వార్డు కౌన్సిలర్ తోకల శ్యామణి



**పెద్దపల్లి/ రామగుండం: మార్చి 10 (వార్తాప్రభ ప్రతినిధి)**6వ వార్డు పరిధి జనగామలో 99 రోజుల ప్రజా-పాలన ప్రగతి-ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం ప్రజారోగ్యానికి ఎంతో మేలు చేకూర్చింది. మంగళవారం స్థానిక యు.పి.హెచ్.సి.లో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని బిఆర్ఎస్ కౌన్సిలర్ తోకల శ్యామణి అధికారికంగా ప్రారంభించారు. ఈ క్యాంప్‌లో గైనకాలజిస్ట్, పీడియాట్రిక్, ఆప్తమాలజిస్ట్, ఆర్థోపెడిక్, డెంటల్, జనరల్ మెడిసిన్ వంటి వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు నాణ్యమైన చికిత్సను అందించారు. నిపుణులతో పాటు ఇతర వైద్య సిబ్బంది పాల్గొని రోగులకు విశేష సేవలు అందించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఒకే చోట ఇన్ని రకాల స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉండటం వల్ల మెరుగైన ఉచిత చికిత్స లభించింది. ప్రజా-పాలన లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం నేరుగా ప్రజల వద్దకు వైద్య సేవలను తీసుకువెళ్లడం అభినందనీయమని స్థానికులు కొనియాడారు. ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు సామాన్యులకు ఆరోగ్య భరోసాను కల్పిస్తాయి. వందలాది మంది రోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఆరోగ్య సమస్యలకు పరిష్కారం పొందారు. ఈ కార్యక్రమం ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వానికి ఉన్న బాధ్యతను చాటిచెప్పింది. వైద్య సేవలు అందించిన సిబ్బందిని ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

# న్యాయవాదుల పోరుబాట!!


● సీఐకి ఖాకీ దర్పం తగదు ● పట్టించుకోని పైఅధికారులు ● సస్పెండ్ చేసేవరకు నిరసనలు ఆగవు ● న్యాయవాది గజ్జెల్లి వెంకటేశ్వర్లు




**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 10 (వార్తాప్రభ ప్రతినిధి)**గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి తీరుకు నిరసనగా గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 5వ రోజుకు చేరుకున్నాయి. గత నెల 10న న్యాయవాది మార్కపురి తిలక్‌పై సీఐ, అతని గన్‌మన్ దాడి చేశారని, ప్రశ్నించిన సీనియర్ న్యాయవాదుల పట్ల సీఐ దురుసుగా ప్రవర్తించారని న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. సీపీ, ఐజీ, డీజీపీలకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ న్యాయవాదులు దీక్షను కొనసాగిస్తున్నారు. దీక్షకు సంఘీభావం తెలుపుతూ న్యాయవాది గజ్జెల్లి వెంకటేశ్వర్లు ఐదో రోజు రిలే నిరాహార దీక్షలో కూర్చుని మాట్లాడుతూ.... సీఐ ఇంద్రసేనా రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుండి వ్యాపారులు, విలేకరులతో కూడా అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. తప్పు చేయడం, ఆపై బార్ అసోసియేషన్‌కు వచ్చి క్షమాపణ చెప్పడం ఆయనకు అలవాటుగా మారిందని, ఇలాంటి ప్రవర్తన కలిగిన అధికారిని వెంటనే సస్పెండ్ చేసి బదిలీ చేయాలని వారు డిమాండ్ చేశారు.

# గెలిచింది "ఆమె".. గత్తర చేస్తోంది "ఆయన"!!

● రామగుండంలో భర్తల పెత్తనం ● మహిళా కార్పొరేటర్లకు "నిల్లు"విలువ ● భార్యల పదవులపై భర్తల బిల్డప్ ● ప్రోటోకాల్‌కు పాతర ● ప్రజాస్వామ్యానికి అపహాస్యం ● కలెక్టర్ తప్పకుండా చర్యలు తీసుకోవాలి







**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 7 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం నగరపాలక సంస్థలో మహిళా సాధికారత కేవలం కాగితాలకే పరిమితమవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి, రిజర్వేషన్ల పుణ్యమా అని మహిళలు కార్పొరేటర్లుగా గెలుపొందినా, క్షేత్రస్థాయిలో మాత్రం వారి భర్తల పెత్తనమే సాగుతుండటం గమనార్హం. నగరంలోని 30 మంది మహిళా కార్పొరేటర్లలో ఎంతమందికి నిజమైన గౌరవం దక్కుతుందో అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఎందుకంటే వార్డుల్లో పర్యటనలు మొదలుకొని అధికారిక సమీక్షా సమావేశాల వరకు అంతా భర్తలే చక్రం తిప్పుతున్నారు. ప్రజలు ఓట్లేసి గెలిపించిన మహిళా ప్రతినిధులు ఇంటికే పరిమితమవుతుంటే, ఎలాంటి పదవి లేని వారి భర్తలు తామే లీడర్లుగా ఫోజులిస్తూ అధికారిక కార్యక్రమాల్లో ఫోటోలకు ప్రాధాన్యత ఇస్తుండటం పట్ల మేధావుల నుండి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రోటోకాల్ ప్రకారం ఎన్నికైన మహిళా ప్రతినిధులకే గౌరవం దక్కాల్సి ఉండగా, అధికారుల సమక్షంలోనే భర్తలు పెత్తనం చలాయిస్తున్నా ఎవరూ నోరు మెదపకపోవడం శోచనీయం. ఈ ధోరణి వల్ల మహిళా నాయకత్వం అణచివేయబడుతోందని, ఓటర్లు తమ నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మేయర్, జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి, అధికారిక కార్యక్రమాల్లో కేవలం ఎన్నికైన మహిళా కార్పొరేటర్లు మాత్రమే పాల్గొనేలా కఠిన నిబంధనలు అమలు చేయాలని, మహిళా ప్రతినిధులకు దక్కాల్సిన అసలైన గౌరవాన్ని కాపాడాలని రామగుండం ప్రజలు, ఓటర్లు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రజా సేవే లక్ష్యంగా యువ నాయకులు రాగం అనిరుధ్ యాదవ్

**'ఘనంగా అనిరుధ్ జన్మ దిన వేడుకలు.**

**పలువురి శుభాకాంక్షలు - సేవా కార్యక్రమాలు**



**శేరిలింగంపల్లి,మార్చి 10 (వార్తాప్రభ):**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్ర మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్పర్సన్ రాగం సుజాత యాదవ్, శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ దంపతుల తనయుడు,రాష్ట్ర యువజన నాయకుడు రాగం అనిరుధ్ యాదవ్ జన్మదిన వేడుకలు నల్లగండ్లలోని వర్టెక్స్ కింగ్‌స్టన్ పార్క్ విల్లాస్ నివాసంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భారీ కేక్ కటింగ్ కార్యక్రమం ఏర్పాటు చేయగా శేరిలింగంపల్లి ప్రాంతానికి చెందిన సీనియర్ నాయకులు,మహిళా నాయకురాళ్లు,యువ నాయకులు,బూత్ కమిటీ సభ్యులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు,అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రాగం అనిరుధ్ యాదవ్‌ను గజమాలలు,శాలువాలతో సత్కరించి పూలబొకేలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న యువనేత రాగం అనిరుధ్ యాదవ్ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించి ప్రజా సేవలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు.

# సమాచార హక్కు చట్టాన్ని ప్రతి పోలీస్ స్టేషన్‌లో సమర్థవంతంగా అమలు చేయాలి.

**- జాతీయ ఛైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్**



**హైదరాబాద్ మార్చి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సమాచార హక్కు చట్టం--2005ను తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో సమర్థవంతంగా అమలు చేసి, పౌరులు కోరిన సమాచారాన్ని నిర్ణీత గడువులో అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ మరియు రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆధ్వర్యంలో తెలంగాణ డీజీపీ బి. శివధర్ రెడ్డి గారిని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు డీజీపీకి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం ప్రభుత్వ పాలనలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి ఎంతో కీలకమని తెలిపారు. 2005లో అమలులోకి వచ్చిన ఈ చట్టం ద్వారా ప్రజలు ప్రభుత్వ పనితీరును తెలుసుకునే హక్కు పొందారని అన్నారు. పన్ను చెల్లింపుదారుల డబ్బు ఎలా ఖర్చు అవుతుందో తెలుసుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉందని పేర్కొన్నారు.అలాగే ప్రజలు రేషన్ పంపిణీ, పెన్షన్లు, పౌర సేవలకు సంబంధించిన సమాచారాన్ని ఈ చట్టం ద్వారా పొందగలరని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే సార్వభౌమాధికారులు కాబట్టి, ప్రభుత్వ పనితీరును పర్యవేక్షించేందుకు సమాచార హక్కు చట్టం ఒక శక్తివంతమైన సాధనమని అన్నారు.ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి తోట శ్రీనివాస్ ,రాష్ట్ర కో ఆర్డినేటర్ కొంగంటి రాజ్ కుమార్, రాష్ట్ర కో - కన్వీనర్ గడప కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కడమంచి అజయ్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాష్ పటేల్,మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

## ఘనంగా దేశ తొలిమహిళా ఉపాధ్యాయరాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు

**ఐ.ఎల్.పీ.ఏ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భానుప్రియ**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కొత్తగూడెం: దేశ తొలిమహిళా ఉపాధ్యాయురాలు,సంఘ సంస్కర్త మాతా సావిత్రిబాయి పూలే అని ఐ.ఎల్.పీ.ఏ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు,న్యాయవాది సుంకర భానుప్రియ అన్నారు.మంగళవారం సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని కొత్తగూడెం న్యాయవాదుల లైబ్రరీ హాల్ నందు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం ఆమె మాట్లాడుతూ కుల,మత భేదాలకు అతీతంగా ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమవుతుందని నమ్మిన సావిత్రిబాయి పూలే భర్తతో కలిసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించిందన్నారు.కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పీడిత ప్రజలు ముఖ్యంగా మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం ఉద్యమకారిణి అని కొనియాడారు.సావిత్రిబాయి పూలే లక్ష్యాలు,ఆశయాల్ని అచరించాలనుకునే ప్రతి ఒక్కరూ ఆమె జీవితాన్ని అధ్యయనం చేయాలని,దేశానికి మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలేనని చాటి చెప్పాలన్నారు.నేటి యువతి, యువకులు ఆమె ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ,యెర్రా కామేష్,మల్లెల ఉష రాణి,అడపాల పార్వతీ,నీలవేణి,గోపీకృష్ణ, ఎర్రపాటి కృష్ణ,మారపాక రమేష్,నాగస్రవంతి ,శ్వేత,స్వప్న, సంధ్యారాణి ,పద్మకల,బేబీ షామిలి,హర్షిత తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటు లోకి త్వరలో "మహిళా భవన్"



**శేరిలింగంపల్లి,మార్చి 10 (వార్తాప్రభ):** కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్ కాలనీలో మహిళ భవనం నిర్మాణానికి రూ.20 లక్షల అంచనా వ్యయంతో (ఎంఎల్ఏ ఎస్ డిఎఫ్ నిధులు) ప్రతిపాదనలు పంపిన మంజూరి పత్రాలను కాలనీ వాసులకు పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మహిళల అభ్యర్థన మేరకు మహిళ భవనం నిర్మాణం కోసం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.నిధులు మంజూరు అయిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించి త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. మహిళలు సమావేశాలు,చిన్న కార్యక్రమాలు నిర్వహించుకునే విధంగా ఈ భవనం ఉపయోగపడుతుందని తెలిపారు.ప్రేమ్ నగర్ కాలనీతో పాటు కొండాపూర్ డివిజన్ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు తిరుపతి,వాసల వెంకటేశ్వరరావు,గాజుల మహేందర్,కొనవేని రమేష్, వాసల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## "జాగృతి" ఎ.శివ పార్వతి ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళ దినోత్సవం వేడుకలు





**కుత్బుల్లాపూర్, మార్చి 10, (వార్తాప్రభ) ;** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం షాపూర్ నగర్ లో శివ పార్వతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ మల్కాజ్గిరి బిజెపి జిల్లా ఇంచార్జ్ మల్లారెడ్డి, ఏవి రావు, లోక్సత్తా రవీందర్, పుప్పాల భాస్కర్, పెద్ద మల్లేష్ ముఖ్య అతిథులుగా పాల్గొని మహిళా మణులకు మహిళా దినోత్సవం శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం మహిళలకు శాలువాలతో సత్కరించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో జీవితంలో మహిళల ప్రాధాన్యత ఏ విధంగా ఉందో వివరించారు. ఒక తల్లిగా, భార్యగా చెల్లిగా, అక్కగా జీవితంలో ఎలాంటి బాధ్యతలను పోషించగలరు వివరించారు. మహిళలు అబలలు... కాదు సభలలు.. జననాలను గమనాలను శాసించగల ఒక నిశ్శబ్ద విప్లవమే మహిళ... తరతరాల అంతరాల దొంతరలను తొలగిస్తూ అన్ని రంగాలలో పురుషులకు దీటుగా మహిళలు స్వశక్తితో ఎదుగుతూ ప్రపంచానికి ఒక దిక్సూచిగా నిలుస్తుండడం ఎంతో గర్వకారణం అని గుర్తు చేశారు. మహిళ దినోత్సవం సందర్భంగా మహిళలను సత్కరించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ బిక్షపతి, మక్కేన లక్ష్మమ్మ, జయశ్రీ, హీరాబాయి, ఉష, జ్యోతి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## ఇరాన్ ఒంటరి కాదు.. ఆ దేశం వెనుక అతిపెద్ద శక్తులు !

అమెరికా, ఇజ్రాయిల్ ఒకవైపు.. ఇరాన్ మరోవైపు. యుద్ధం చూస్తున్న మనకు పిక్చర్ ఇలాగే కనిపిస్తుంది. కానీ యుద్ధంలో అదృశ్య శక్తులు ఉన్నాయి. వెనక నుంచి పోరాడుతున్నాయి. కానీ నేరుగా యుద్ధరంగంలోకి దిగవు. ప్రపంచ పోలీస్ పీచమణచడమే అదృశ్య శక్తుల లక్ష్యం. యుద్ధం అనంతర పరిణామాలు తమకు అనుకూలంగా మార్చుకోవడమే అదృశ్య శక్తుల టార్గెట్. అందుకే తెర వెనుక ఉండి యుద్ధం చేస్తున్నాయి. చేయిస్తున్నాయి. అదృశ్య శక్తులెవరు ఇరాన్ ఒంటరిగా పోరాడుతోంది. కానీ ఖచ్చితమైన టార్గెట్లను చేధిస్తోంది. గల్ఫ్ దేశాల్లోని యూఎస్ బేస్ లపై దాడి చేస్తోంది. ఆయిల్ రిఫైనరీలపై దాడి చేసి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి తెస్తోంది. హోర్మూజ్ జలసంధి దిగ్బంధనం చేసి ప్రపంచ వాణిజ్యాన్ని షేక్ చేస్తోంది. ఇదంతా కేవలం ఇరాన్ మాత్రమే చేయడం లేదన్న చర్చ ఉంది. దీని వెనుక చైనా ఉంది. రష్యా ఉంది. చైనా ఇరాన్ ఆయిల్ కొంటోంది. టెక్నాలజీ, ఆయుధాలను అందిస్తోంది. రష్యా కూడా బహిరంగ మద్దతు ప్రకటిస్తూ కీలక ఆయుధ, సైనిక సమాచారాన్ని చేరవేస్తోంది. అందుకే ఇరాన్ టార్గెట్లు గురితప్పడం లేదని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇరాన్ వెనుక ఉన్న అదృశ్య శక్తులు చైనా, రష్యాలే. రష్యా ఇప్పటికే ఉక్రెయిన్ తో యుద్ధం చేస్తోంది. నేరుగా యూఎస్ తో తలపడితే అది మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుంది. కాబట్టి యుద్ధం త్వరగా ముగించే ఆలోచన చేయాలని ట్రంప్ ను కోరుతోంది. అదే సమయంలో ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబ ఆయతుల్లా ఎన్నికను బహిరంగంగా స్వాగతించింది. తద్వారా తాము ఇరాన్ పక్షాన ఉన్నట్టు పరోక్షంగా ప్రకటించింది. చైనా యుద్ధం చేయడం ద్వారా నష్టం తప్ప లాభం లేదన్న నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఇరాన్–ఇజ్రాయిల్, అమెరికా యుద్ధానంతర పరిణామాలు తమకు అనుకూలంగా మార్చుకునే ఎత్తుగడతో చైనా ఉన్నట్టు తెలుస్తోంది. ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడి భవిష్యత్తులో చైనాకు కలిసొస్తుంది. చైనా ఎలా లాభపడుతుంది ? అమెరికా గల్ఫ్ దేశాలతో మైత్రి కొనసాగిస్తూ డాలర్ ఆధిపత్యాన్ని నిలుపుకుంటోంది. ఇరాన్ గల్ఫ్ దేశాలపై నిరంతర దాడి.. గల్ఫ్ దేశాలు అమెరికాతో స్నేహం గురించి ఆలోచించాల్సిన పరిస్థితి తీసుకొచ్చింది. యుద్ధం ముగిసిన అనంతరం అమెరికాతో స్నేహ బంధం, పెట్టుబడులు, వాణిజ్య సంబంధాలు మంచిది కాదన్న అభిప్రాయానికి గల్ఫ్ దేశాలు వచ్చే పరిస్థితి ఉండొచ్చు. ఎందుకంటే అమెరికాతో సంబంధాల కారణంగా గల్ఫ్ దేశాలు ఇరాన్ టార్గెట్ అవుతాయి. ఫలితంగా గల్ఫ్ దేశాలు విదేశీ పెట్టుబడులకు, నివాసానికి ఏమాత్రం భద్రమైన ప్రాంతం కావు. అమెరికాతో స్నేహం, ఇరాన్ దాడులు గల్ఫ్ దేశాలపై ఇన్నాళ్లు పెట్టుబడిదారులకు ఉన్న అభిప్రాయాలను తొలగిస్తున్నాయి. దీనివల్ల గల్ఫ్ దేశాల బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటుంది. కాబట్టి అమెరికాతో స్నేహం గురించి ఆలోచించాల్సి వస్తుంది. ఇది చైనాకు అడ్వాంటేజ్ అవుతుంది. చైనా అమెరికా పొజిషన్ లోకి వచ్చే అవకాశం ఉంటుంది. మిడిల్ ఈస్ట్ లో చైనా డామినెన్స్ పెరిగితే చైనాకు మరింత పట్టు దొరుకుతుంది. ఇది జియో పాలిటిక్స్ ను మార్చేస్తుంది. అందుకే చైనా యుద్ధం చేయకుండా, యుద్ధానంతర పరిణామాలను క్యాష్ చేసుకోవడానికి చూస్తోంది.

## అగ్ని ప్రమాద నిరోధక అవగాహన కార్యక్రమం నిర్వహించిన విఎంసి ఫైర్ ఆఫీసర్స్





**విజయవాడ పశ్చిమ మార్చి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి మంగళవారం ఉదయం భవానీపురం మరియు ఐరన్ యార్డ్ ప్రాంతంలలో ఉన్న బాణాసంచా దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేసారు వి యం సి సిబ్బంది. ఈ కార్యక్రమంలో అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించు విధానము, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా అర్పాలి, ఎటువంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఫైర్ ఆఫీసర్ మల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం సీఐగా సుబ్రహ్మణ్యం బాధ్యతలు స్వీకరణ



**ఇబ్రహీంపట్నం, మార్చి 10(వార్తా ప్రభ ప్రతినిధి):** సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఎ.సుబ్రహ్మణ్యం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ సిటీ టాస్క్ ఫోర్స్ సీఐగా పనిచేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ ఎ.చంద్రశేఖర్ స్పెషల్ బ్రాంచి సీఐగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన సీఐ సుబ్రహ్మణ్యంకు బదిలీపై వెళుతున్న సీఐ చంద్రశేఖర్ బాధ్యతలు అప్పగించారు. నూతన సీఐని ఎస్సైలు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## పరాజయం కారణం తెల్చుకో.... విజయానికి మార్గం సుగమం చేసుకో



**విజయవాడ పశ్చిమ మార్చి 10:(వార్తా ప్రభ ప్రతినిధి)**పరాజయానికి కృంగిపోకుండా పరాజయానికి కారణం ఏంటో తెలుసుకొని ఆ తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకు పోవడమే విజయానికి పూలబాట అవుతుందని మేదర హర్షిత అన్నారు. ఇటీవల విడుదలైన యూపీఎస్సీ సివిల్ సర్వీస్ పరీక్షల ఫలితాలలో 520 ర్యాంక్ సాధించిన మేదర హర్షిత కు సోమవారం రామరాజ్యనగర్ జి ఎన్ ఆర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో పాఠశాల తరఫున సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను కూడా ఈ ర్యాంకు సాధించడానికి ముందు ఎన్నో అవరోధాలు ఎదురైనప్పటికీ కృంగిపోక తప్పులు తెలుసుకుంటూ, సరిదిద్దుకుంటూ ముందుకు సాగానని, ఈ ప్రయాణంలో తల్లిదండ్రులు, స్నేహితులు అందించిన సహకారం మరువలేనన్నారు. అలాగే విద్యార్థులు కూడా విజయం సాధించాలంటే నిరంతరం కృషి చేయడంతో పాటు ఇతరులకు సేవ చేసే గుణాన్ని కూడా అలవర్చుకోవాలని సూచించారు. తాను విజయవాడ వాసిగా ఎంతో గర్వపడుతున్నానని, విద్యార్థులందరూ మంచి స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, పుట్టిన ఊరుకు గుర్తింపు తీసుకురావాలని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి వి రవికుమార్ మాట్లాడుతూ ఇలాంటి విజయాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. విజేతలు చెప్పే ప్రతి మాటను విద్యార్థులు శ్రద్ధగా గమనించి తమ జీవితాలకు, తమ లక్ష్యసాధనకు అన్వయించుకోవాలి అన్నారు. హర్షిత తండ్రి విజయవాడ ట్రాఫిక్ సిఐ సుధాకర్ మాట్లాడుతూ తాను చదువుకున్న గాంధీజీ హై స్కూల్ కు చాలా రకాల సహాయాలను అందించామని, కోవిడ్ సమయంలో కూడా పలు సేవా కార్యక్రమాలు చేపట్టామని, మనం చేసిన మంచి మన కుటుంబానికి మంచి కలిగిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. పాఠశాల తెలుగు పండితులు ఉదయ్ కిరణ్ హర్షిత ను పరిచయం చేయగా హర్షిత ను శాలువ తో సత్కరించి మొక్క, జ్ఞాపిక లను ఉపాధ్యాయులు గణేష్, లక్ష్మి నారాయణ, వసంత లక్ష్మి, లత అందించారు. పాఠశాల విద్యార్థులు స్ఫూర్తి పొందేలా కార్యక్రమం నిర్వహించినందుకు హర్షిత హర్షం వ్యక్తం చేశారు.

## మహిళా సంక్షేమం గురించి మాట్లాడే అర్హత వైసిపి నాయకులకు లేదు

**టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కొట్టేటి హనుమంతరావు**



**విజయవాడ పశ్చిమ మార్చి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మహిళల భద్రత, సంక్షేమం గురించి మాట్లాడే నైతిక అర్హత వైసిపి నాయకులకు లేదని టిడిపి ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు, నగరపాలక సంస్థ టిడిపి మాజీ ఫ్లోర్ లీడర్ కొట్టేటి హనుమంతరావు అన్నారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్ విజయవాడ పార్లమెంటు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కొట్టేటి హనుమంతరావు మాట్లాడుతూ.... కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలు సంతోషంగా లేరంటూ వైసీపీ నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, ఆర్కే రోజా మహిళా దినోత్సవం రోజున మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండించారు. మహిళల సంక్షేమం గురించి మాట్లాడే కనీస అర్హత ఆర్కే రోజాకు, సజ్జల రామకృష్ణారెడ్డికి లేదన్నారు. వైసిపి ప్రభుత్వ పాలనలో మహిళలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. మహిళలకు భద్రత కరువైందన్నారు. మహిళల సంక్షేమం జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో అటకెక్కిందని, మహిళలు రోడ్డుపై తిరగాలంటేనే ఆనాడు భయపడ్డారన్నారు. డ్వాక్రా సంఘాలను నిర్వీర్యం చేశారన్నారు. నేడు కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలు ఆత్మవిశ్వాసంతో ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు నారా లోకేష్ మహిళ సాధికారిత దిశగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. మహిళా భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపేట వేస్తోందని, మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా అనేక పథకాలను ప్రభుత్వం ప్రవేశపెడుతుందన్నారు. మహిళలకు ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణం సహా ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది మహిళల గౌరవం కూటమి ప్రభుత్వంలో పెరిగేలా చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టారన్నారు. ఇవేమీ తెలియని వైసీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఆంధ్ర రాష్ట్రంలోని మహిళలు క్షమించరన్నారు. మహిళా దినోత్సవం రోజున మహిళలను అవమానపరిచేలా వైసీపీ నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, ఆర్కే రోజా చేసిన వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న కాలంలో మహిళలు వైసీపీ నాయకులకు మరోసారి బుద్ధి చెప్పటం ఖాయమన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి ఎన్టీఆర్ జిల్లా ఆర్గనైజేషన్ కార్యదర్శి దోమగుంట్ల రవికుమార్, అర్బన్ మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఇర్ఫాన్ పాల్గొన్నారు...

## శాఖాధిపతులతో కౌన్సిల్ ఎజెండా పై నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి సమీక్ష సమావేశం



**విజయవాడ పశ్చిమ మార్చి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నేడు (మార్చి 11,) 2026 న జరిగే కౌన్సిల్ ఎజెండా పై నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల తమ చాంబర్లో మంగళవారం ఉదయం శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కౌన్సిల్ ఎజెండా, అడిషనల్ ఎజెండా ఉన్న ప్రతిపాదనలను శాఖధిపతులతో చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సభ్యులు ఇచ్చిన ప్రతిపాదనలను అధికారులు అందరూ సహకరించాలని, ప్రజల కోసం విజయవాడ నగరపాలక సంస్థ ఎల్లప్పుడూ తోడుగా ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (జనరల్) ఎ. రవీంద్రరావు, సెక్రటరీ ఇంచార్జి కె. ప్రభుదాస్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఐ/సీ పి. సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, ఎస్టేట్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, సూపరింటెండెంట్ ఇంజనీర్ వి. చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) ఎం విజయలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి. శ్రీనివాస్, సామ్రాజ్యం, ప్రభాకర్, సురేఖ, గోపాలకృష్ణ, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ చక్రవర్తి, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, గోపాల నాయక్, బయాలజిస్ట్ కామేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## దుర్గగుడి ప్రాంగణంలో చోరీ కేసులో నిందితురాలు అరెస్టు

**రూ.18లక్షల విలువైన బంగారు అభరణాలు స్వాధీనం**



**విజయవాడ పశ్చిమ మార్చి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ దుర్గగుడి భక్తురాలి బంగారు అభరణాలు చోరీ కేసులో నిందితురాలిని విజయవాడ వన్టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం వన్టౌన్ పోలీస్ ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ చోరీ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈనెల 6వతేదీన ఇంద్రకీలాద్రి పై మహాకుంభిషేకంలో హైదరాబాద్కు చెందిన కాకర్ల సుష్మ కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చారు. అమ్మవారి దర్శనం అనంతరం క్యూలైన్ నుండి ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద తన బంగారం అభరణాలను ప్లాస్టిక్ బాక్స్ పెట్టారు. కొద్దిసేపటికి గుర్తుతెలియని దుండగులు 125 గ్రాముల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వనటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నేరం జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో చూట్టు ప్రక్కల ఉన్న సీసీ కెమెరాలను టైంలైన్ ఆధారంగా పరికేవించారు. నేరం జరిగిన తరువాత పది నిముషాలు సమయంలో రావిచెట్టు ప్రాంతం నుంచి వచ్చిన ప్రతి వ్యక్తిని గమనించి వారి కదలికలను గుర్తించారు. వానందది. సుమారుగా 20 గ్రూపులుగా విభజించి రావిచెట్టు దగ్గర నుండి స్కానింగ్ పాయింట్, కొత్త రాజగోపురం, శివాలయం, శారీ కౌంటర్ల వద్ద వారు గడిపిన సమయాన్ని కదలికలను గమనించి ఓ అనుమానిత యువతిని గుర్తించారు. ఆ యువతి అటోస్టాండ్లో ఆటో ఎక్కస్థానిక ఓ లాడ్జికి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఓ లాడ్జీలో తప్పుడు ఆధార్, ఫోన్ నెంబర్ ఇవ్వడంతో పోలీసులకు మరింత అనుమానం కలిగింది. దీంతో ఆమె ఫోటోతో నాట్ గ్రిడ్ సాంకేతిక పరిజ్ఞానంతో విశాఖపట్నరం జిల్లా మధురవాడకు చెందిన పాత నేరస్థురాలు కోవెలకొండ నీరజగా పోలీసులు గుర్తించారు. నేరం జరిగిన 24గంటలోపే నిందితురాలను అరెస్టు వేచాడు. ఆమె నుండి 125 గ్రాముల బంగారం అభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నీరజ పై విశాఖప్పటం మహారాజి పోలీస్ స్టేషన్, గోపాలపట్నం, విశాఖ స్టేషన్లో సొంతనం కేసులు ఉన్నాయని ఏపీసీపీ రామకృష్ణ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐ గుణరామ్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలి

**ఇబ్రహీంపట్నం ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న దుర్గా ప్రసాద్**




**ఇబ్రహీంపట్నం, మార్చి 10 (వార్తా ప్రభ ప్రతినిధి):** వేసవిలో కారణంగా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా గ్రామ పంచాయతీ కార్యదర్శులు సూచించారు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న దుర్గాప్రసాద్. మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సాధారణ సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి ఎంపీపీ జ్యోత్స్న అధ్యక్షత వహించగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను సమర్పించారు. విద్యుత్ శాఖ ఏఈ వెంకన్న మాట్లాడుతూ వేసవి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రతి గ్రామంలో కొత్త ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ను ఆదా చేయడంతో పాటు విద్యుత్ బిల్లు తగ్గుతుందన్నారు. 200 యూనిట్లు లోపు విద్యుత్ ను వినియోగించే ఎస్సీలకు ఉచితంగా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కొండపల్లి పశు వైద్య శాల అధికారి డాక్టర్ స్వాతి మాట్లాడుతూ గొర్రెలకు నట్టల నివారణ, గాలి కుంటు వ్యాధి టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. కాచవరం సర్పంచ్ రాజేంద్రప్రసాద్, కొటికలపూడి సర్పంచ్ నాగరాజు ఆయా గ్రామాల రెవెన్యూ సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

## మహాదేవు అప్పాజీ రావు ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు





**విజయవాడ పశ్చిమ మార్చి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**53వ డివిజన్ పరిధిలోపవిత్ర రంజాన్ మాసం సందర్భంగా చేపల మార్కెట్ లో డ్రైఫిష్ ముస్లిం వ్యాపారస్తులకుజన సేన పార్టీ తరుపున 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి. ముస్లిం సోదరులకు రంజాన్ అభినందనలు తెలియజేశారు. అన్ని మతాల వారు తమ తమ మతాల ఆచారాలను, సంప్రదాయాలను గౌరవించు కుంటూ, ఇతర మతాల వారిని గౌరవం ఇవ్వడం మన గొప్పతనం అని, భవిష్యత్తు తరాలు కూడా ఈ సనాతన ధర్మం ని పాటించాలని, ఇదే మన డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆశయం అని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిల్ల రాజేష్, తెలుగుదేశం నాయకులు మైలవరపు దుర్గారావు, డివిజన్ అధ్యక్షుడు పులిచేరి రమేష్, రేఖపల్లి శ్రీను, ప్రసన్న మరియు ముస్లిం వ్యాపారులు అధ్యక్ష కార్యదర్శులు సలీం, రఫీ, గఫార్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రి భాయ్ పూలే కి ఘన నివాళులు





**విజయవాడ పశ్చిమ మార్చి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఏపీ పి.టి.డి (ఆర్టీసీ) బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆధ్వర్యంలో అసోసియేషన్ కార్యాలయం వద్ద సామాజిక విప్లవకారిని, భారతదేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు, రచయిత్రి, శ్రీమతి సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఏపీ పిటిడి బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులుఎస్పీ శేషగిరిరావు మాట్లాడుతూ వారు విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మి భర్తతో కలిసి మొట్టమొదటగా పూణేలో బాలికలకు పాఠశాలలను ఏర్పర్చి, నాటి సామాజిక పరిస్థితులలో అనేక ఇబ్బందులు ధైర్యంగా ఎదుర్కొని మహిళల విద్యాభివృద్ధికి నాంది పలికారు. శ్రీమతి సావిత్రిబాయి పులే. ఆనాటి దురాచారాలైన సతీసహగమనం వ్యతిరేకంగా పోరాడి, వితంతు మహిళలకు ఆశ్రయం ఆశ్రమాలు ఏర్పాటు చేశారు. పూలే స్థాపించిన సత్య సేవక్ సమాజ్ కు మహిళా విభాగాన్ని ఏర్పాటు చేసి చైతన్యవంతం చేశారు, మహిళా సేవ మండల్ సంఘాన్ని స్థాపించి, లింగ వివక్ష,కుల,పితృ సామ్య వ్యవస్థలచే అణచి వేయబడుతున్న మహిళల సాధికారత కోసం ఆమె విశేషంగా కృషి న మహాత్మురాలు శ్రీమతి సావిత్రిబాయి పూలేని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ పిటిడి బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్పీ.శేషగిరిరావు, బీసీ మహిళలు, ఆర్. అమృత, ఎం.దుర్గా, టీ.ప్రమీల,జి.యశోద, సభ్యులు ఏవీఎస్ఎన్ ప్రసాద్, ఐ.రాజు,రజక సంఘం నాయకులు జి. వెంకటరామయ్య, ఏం.మోజస్, పోతిన.రాంబాబు, పి వెంకటేశ్వరరావు, టి.పూర్ణయ్య తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## పేద,మధ్యతరగతి ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యధిక ప్రాధాన్యత

**యనమదల గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన మంత్రి ఆనం**



**నెల్లూరు మార్చి 10 (వార్తాప్రభ)** పేద మధ్యతరగతి ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తూ వారికి అన్నివిధాల ఎన్డీఎ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు .మంగళవారం నెల్లూరు జిల్లా చేజర్ల మండలం యనమదల గ్రామంలో చేజర్ల మండలానికి చెందిన లబ్ధిదారులకు రూ.8,53,631 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో తమ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు 742 కుటుంబాలకు 6.94 కోట్ల రూపాయలను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందించినట్లు చెప్పారు. వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

# పాతగుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జోరుగా దొంగతనాలు....

- గస్తీ విధులు నిర్వర్తించే పోలీసులు అంతా పాంతూ ఉండని వైనం.
- నిదుర పట్టగ బెంబేలెత్తిపోతూ పాతగుంటూరు పోలీసుల విధుల నిర్వాహణ పనితీరుపై కారాలు మిరియాలు నూరుతున్న స్థానికులు..

**గుంటూరు మార్చి 10 ( వార్తాప్రభ ప్రతినిధి):-** గుంటూరు ఈస్ట్ లా అండ్ ఆర్డర్ సబ్ డివిజన్ పరిధిలో గల పాతగుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్లబజారు మరియు ఇటుకల బట్టీల రోడ్ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు రాత్రి వేళల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా తమవంతు బాధ్యతాయుతంగా తగిన రక్షణ భాగ్యాన్ని కల్పించాల్సిన పాతగుంటూరు పోలీసులు రాత్రి వేళల్లో నిర్వర్తించాల్సిన బీటు విధులపట్ల నిర్లక్ష్యపు ధోరణిని వ్యక్తపరుస్తూ నిరంతరం గస్తీ విధులకు దుమ్ము కొడుతూ పత్తాలేకుండా పోవుతున్న సందర్భాన్ని అదునుగా భావించిన దొంగలముఠా నడిరేయి వేళల్లో రెడ్లబజారుతో పాటు ఇటుకల బట్టీల రోడ్ ప్రాంతాలను దొంగలు తమ అడ్డాగా మల్చుకొని నిర్భయంగా దొంగతనాల హవ్వాను యథేచ్ఛగా కొనసాగిస్తుండటం మూలంగా స్థిర నివాసితులు హడలెత్తిపోయి నెత్తి నోరు కొట్టుకొంటూ గత ప్రభుత్వంలో ఎలాంటి అలజడులు నెరుగక హాయిగా బ్రతికామని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు రక్షణ కరువైందని గగ్గోలు పెడుతూ కన్నీరు మున్నీరౌతూ వారి గోడును వెలబుచ్చుతున్నారు. రెడ్లబజారు ,ఇటుకలు బట్టీల రోడ్ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఏరోజుకారోజే రెక్కాడితే కానీ డొక్కాడని జీవన పరిస్థితి. పగలంతా వెట్టిచాకిరీ చేసి సాయంత్రానికి ముద్దభోంచేసి రాత్రిపూట పొదుకుందామంటే కునుకు పట్టని పరిస్థితి దాపురించడంతో గుండె దడతో గజగజమంటూ ఇదెక్కడి ఖర్మరా నాయనా అంటూ కుటుంబ సమేతంగా ఆర్తనాదాలు పెడుతున్నారు.పాతగుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్లబజారు మరియు ఇటుకల బట్టీల రోడ్ ప్రాంతాల్లో జరుగుతున్న దొంగతనాల పై ఉన్నతాధికారులు మానవీయ కోణంలో యుద్ధప్రాతిపదికన స్పందించి ప్రత్యేక దృష్టిని చాలించి రెడ్లబజారు మరియు ఇటుకల బట్టీల రోడ్ ప్రాంతాల్లో ఎలాంటి దొంగతనాలకు తావీవ్వకుండా దేగకన్ను నిఘాని కొనసాగించి రాత్రివేళ యందు ప్రజా గస్తీ విధులను ఉధృతం చేయుంచి దొంగతనాలను కట్టడి చేసే దిశగా ఛాయకుల కృషి చేసి సహకరించి ప్రజలకు దోహదపడగలరని నివాసితులు ఆకాంక్షిస్తున్నారు.

# సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించిన యార్లగడ్డ



**గన్నవరం :మార్చి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జాతిపిత మహాత్మా గాంధీ నివసించిన సబర్మతి ఆశ్రమాన్ని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోమవారం సందర్శించారు. గుజరాత్లోని అహ్మదాబాద్ పట్టణానికి సమీపంలో సబర్మతి నది ఒడ్డున 1917 వ సంవత్సరం మహాత్మా గాంధీ ఈ ఆశ్రమాన్ని నిర్మించారు. అప్పటినుంచి 1930 సంవత్సరం వరకు గాంధీజీ ఇదే ఆశ్రమంలో నివసించారు. భారత స్వాతంత్ర ఉద్యమాన్ని మలుపు తిప్పిన దండయాత్ర ను 1930 మార్చ్ 12 వ తేదీ ఇక్కడి నుంచే గాంధీజీ ప్రారంభించారు. సోమవారం ఆశ్రమాన్ని సందర్శించిన యార్లగడ్డ ఆశ్రమం మొత్తం కలియ తిరిగి ఆశ్రమ విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలోని నేలకు నమస్కరించి గాంధీజీ వినియోగించిన వస్తువులను చూస్తూ ఆయన స్మృతులను గుర్తుచేసుకున్నారు. ప్రపంచంలోనే ఎంతో ప్రాముఖ్యత కలిగిన చారిత్రాత్మక పవిత్ర స్థలాన్ని సందర్శించడం గొప్ప అనుభూతినిచ్చిందని ఈ సందర్భంగా యార్లగడ్డ పేర్కొన్నారు. ఆ మహనీయుడు నడయాడిన పవిత్ర భూమిలో కొద్ది సమయం గడపటం ఉత్సాహాన్నిచ్చిందన్నారు. జాతిపిత గాంధీజీ అడుగుజాడల్లో నడుస్తూ ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత అంకితభావంతో పని చేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఆదివారం రాత్రి జరిగిన టి20 ప్రపంచ కప్ ఫైనల్ పోటీని స్టేడియంలో ఉండి ప్రత్యక్షంగా తిలకించిన ఆయన భారత జట్టు తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించి ఘన విజయం సాధించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. స్టేడియంలోని దాదాపు 1.32 లక్షల మంది క్రికెట్ అభిమానుల కేరింతల మధ్య ఉండి మ్యాచ్ తిలకించడం తన జీవితంలో మర్చిపోలేని సంఘటనగా పేర్కొన్నారు. ఇంతటి భారీ జనసమూహం మధ్య తాను ఎప్పుడు క్రికెట్ మ్యాచ్ చూడలేదని, ఇంత జన సమూహం ఉన్న బహిరంగ సభలలోనూ తాను ఇప్పటి వరకు పాల్గొనలేదని తెలిపారు. భారత జట్టు విజయాన్ని దగ్గరుండి చూడటం ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. స్టేడియంలో ఉన్న జన సమూహం కన్నా ఎక్కువమంది (1.35లక్షలు ) గన్నవరం నియోజకవర్గం లో తనకు ఓట్లు వేసి శాసనసభకు పంపించారని వారందరి సమస్యలు తీర్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి పరంగా ముందంజలో నిలపాలన్న ఆకాంక్ష కలిగిందన్నారు.

# సావిత్రి భాయి పేరుతో ప్రభుత్వమే మహిళలకు మండలానికి ఒక డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలి

**- గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి విజ్ఞప్తి.**



**గన్నవరం, మార్చి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** భారతదేశంలో శతాబ్దాలుగా కొనసాగిన విద్యపై విధించిన ఆంక్షలు.భారతదేశంలోని పూర్వపుశాస్త్రాలు,సంప్రదాయాలు వలన స్త్రీలు చదవకూడదనే దానికి బిన్నంగా సావిత్రి భాయిపూలే అనేక ఇబ్బందులు పడి చేసిన త్యాగాలు పలితంగా భారతదేశంలో మహిళలకు విద్య, అందింది.దాని కోన సాగింపులోనే నేటి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి మండలానికి ఒక మహిళ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, ఈ రోజు గన్నవరం వైఎస్ఆర్ పార్టీ వంశీ కార్యాలయంలో వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షుడు నీలం బాలు అధ్యక్షతన జరిగిన సావిత్రి భాయిపూలే వర్ధంతి సభలో గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు నుండి మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, పెరియార్ వరకు అనేక మహనీయులు విద్య, సమానత్వం, స్వాభిమానానికి ఉద్యమించారన్నారు.అందులో భాగంగానే మహాత్మా జ్యోతిరావు పూలే తన భార్య సావిత్రిబాయిపూల ేనుభారతదేశపుతొలిమహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దారన్నారు.ఇది ఆధునిక భారతదేశ చరిత్రలో ఒకగొప్పసామాజికవిప్లవం.సావిత్రిబాయి పూలే గారు 1831 జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లా ఖండాలా తాలూకా నైగాన్ గ్రామంలో జగదేవ్ పాటిల్ దంపతులకు జన్మించారనీ.ఆమే కు ఎనిమిదేళ్ల వయసులోనే జ్యోతిరావు గోవిందరావు పూలేతో బాల్య వివాహం జరిగిందన్నారు.ఆ కాలంలో భారతదేశంలో బాలికలకు విద్య దాదాపు నిషేధితమే.అలాంటి సమయంలో 1848లోపూనేలోనిబుధ్వార్పేటలోఅతిశూద్రబాలబాలికలకోసంజ్యోతిరావు పూలేమొదటిపాఠశాలను ప్రారంభించారు.ఆపాఠశాలలో సావిత్రిబాయి పూలే మొదటి మహిళాఉపాధ్యాయురాలిగా పనిచేశారు.సమాజంలోని కొందరు తీవ్రంగా వ్యతిరేకించిఆమేపై రాళ్ళు,మట్టి,పేడ కూడా విసిరినా సావిత్రిబాయి వెనక్కి తగ్గలేదు.చదువు కోసం, సమానత్వం కోసం, మహిళల గౌరవం కోసం ఆమె పోరాటం కొనసాగిందన్నారు.అందుకే ఆమేను చదువుల తల్లి భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలుఅని గౌరవంగా పిలుస్తారన్నారు.మహిళల విముక్తి కోసం, ఆమే చేసిన సేవలు భారత చరిత్రలో నేటికైన గుర్తించి సావిత్రి భాయి గారి పేరుతో మండలానికి ఒక మహిళ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వలకు ఆమే విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ ఆఫీస్ కార్యదర్శి వెంకటేశ్వరరావు, దివ్,ప్రకాశరావు, వెంకటేశ్వరావు, ఈదా పద్మ, కూనపూరెడ్డి రజిని,రాజేశ్వరి, దుర్గమ్మ, వెంకటేశ్వరమ్మ, సుజి తదితరులు పాల్గొన్నారు.

# కక్షి దారులకు సత్వర న్యాయమే లోకఅదాలత్ ల ముఖ్య ఉద్దేశం...


**కృష్ణా జిల్లా జడ్జి జి. గోపి**



**మచిలీపట్నం మార్చి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పెండింగ్ లో ఉన్న రాజీ పడదగ్గ సివిల్ మరియు క్రిమినల్ కేసులను సత్వరమే పరిష్కరించడమే జాతీయ లోక్ అదాలత్ యొక్క ముఖ్య ఉద్దేశం అని కృష్ణా జిల్లా జడ్జి జి. గోపి అన్నారు. మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోనిజిల్లా న్యాయ సేవాసదనము లో న్యాయమూర్తుల న్యాయవాదుల సంయుక్త సమావేశానికి జిల్లా జడ్జి జి.గోపి ముఖ్యఅతిథిగా విచ్చేశారు మార్చి 14వ తేదీన దేశవ్యాప్తంగా జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. కృష్ణా జిల్లా వ్యాప్తంగా మచిలీపట్నం విజయవాడ గుడివాడ నందిగామ నూజివీడు తో సహా అన్ని న్యాయస్థానాలలో లో లోక్ ఆదాలత్ బెంచ్ లు ఏర్పాటు చేసినట్లు జిల్లా జడ్జి వివరించారు. కేసులు సత్వర పరిష్కారానికి న్యాయవాదులు పోలీసులు ఇతర అధికారులు సహకరించాలని ఆయన తెలియజేశారు. సత్వర న్యాయం పొందడం ద్వారా ప్రజలకు న్యాయవ్యవస్థ పై మరింత నమ్మకం పెరుగుతుందని అన్నారు. ఇటీవల భూపాల్ లో జరిగిన జాతీయ స్థాయి న్యాయమూర్తుల సమావేశంలో పాల్గొన్న కృష్ణా జిల్లా జడ్జి జి. గోపి లోక్ ఆదాలత్ మరియు మీడియేషన్ యొక్క వివరాలను తెలియజేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇటీవల కృష్ణా జిల్లాకు విచ్చేసిన సందర్భంగా మీడియేషన్ పై ప్రత్యేక సదస్సు నిర్వహించి కేసులు పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చిన విషయం జిల్లా జడ్జి తెలియ చేశారు. జిల్లా కోర్టులో కేసుశ్రీఘ పరిష్కారం కోసం వివిధ బెంచ్ లు న్యాయమూర్తులు న్యాయవాదులతో ఏర్పాటు చేసినట్లు, కక్షిదారులు తమ కేసులను లోకాదాలతో పరిష్కరించుకుని తగిన న్యాయం పొందాలని అన్నారు. చిన్న చిన్న తగాదాలు పరిష్కారం చేసుకోవడం ద్వారాగ్రామాల్లో శాంతి భద్రతలకు కాపాడటానికి లోక్ ఆదాలత్ లు దోహదపడుతుందని అన్నారు. కేసులను సత్వరమే పరిష్కరించడం ద్వారా కక్ష దారులకు న్యాయ వ్యవస్థ పై మరింత నమ్మకం పెరుగుతుందని తద్వారా కొత్త కేసులు ముందుకు వస్తాయని అన్నారు. గత లోక్ ఆదాలత్ లో రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానంలో ఉన్న కృష్ణాజిల్లాను మొదటి స్థానం స్థాయికి తీసుకురావాలని అందుకు న్యాయమూర్తులు న్యాయవాదులు పోలీస్ అధికారులు కక్షిదారులు పరస్పర సహకారంతో ముందుకు వెళ్లాలని అన్నారు. లోక ఆదాలత్ లో పరిష్కారం చేసుకున్న సివిల్ ధావాలకు కోర్టు ఫీజు తిరిగి కక్షిదారులకు చెల్లిస్తారని అందుకోసం కృష్ణా జిల్లా కలెక్టర్ మరియు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ తో కూడా మాట్లాడినట్లు జిల్లా జడ్జి తెలియజేశారు. దేశవ్యాప్తంగా మార్చి 14వ తారీఖున జాతీయ లోక్ ఆదా లత్ ద్వారా కేసులు పరిష్కరించబడుతున్నట్లు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా న్యాయసే వాధికారి సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జ్ రామకృష్ణయ్య, కృష్ణా జిల్లా అదనపు జిల్లా జడ్జీలు జీ. వెంకటేశ్వర్లు, బి.బాబు నాయక్ ఎస్. సుజాత మరియు బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి. పోతురాజు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, పుప్పాల శివరామకృష్ణ ప్రసాద్, పేర్ని సురేష్, మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లు గంజి నాగేంద్రం, సిద్ధినేని సాయిబాబు, శిర్విశెట్టి నగధర్నాథ్, జి. రమాదేవి దేవి జి.వి రమణ, లంకి శెట్టి సాయి ఫణి సంతోష్, ఎం. సువర్ణ సోమరాజు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు

# ఇసుక అక్రమ రవాణాపై అడ్డుకట్టేది...?

**కొటికలపూడి గ్రామంలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా**



**ఇబ్రహీంపట్నం, మార్చి 10 (వార్తా ప్రభ ప్రతినిధి):**ప్రభుత్వ ఇచ్చిన సడలింపును ఆసరాగా చేసుకొని ఇసుక అక్రమ రవాణా చేసి దండుకుంటున్నారు ఇసుకాసురులు. మండల పరిధిలోని కోటికలపూడి గ్రామంలో పట్టపగలే అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారు. ఇందులో స్థానిక గ్రామస్థాయి అధికార పార్టీ నాయకుల హస్తం ఉన్నట్లు తెలుస్తుంది అధికార గ్రామ పార్టీ నాయకుల ఇసుక దందా ను యదేచ్ఛగా చేస్తున్న అటువైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదు. గ్రామంలో అవసరాలకు మాత్రమే ఇసుక తీసుకెళ్లాలని ప్రభుత్వం సడలింపు ఇవ్వటంలో దానిని ఆసరాగా చేసుకొనిగ్రామాలు దాటిస్తుతున్నారునిబంధనలు కాదని నదీ గర్భం నుండి తోసేస్తున్నారు.గుంటుపల్లిలో అర్ధరాత్రి దాడులు, ఇబ్రహీంపట్నం కోటికలపూడి గ్రామాలపై ఉదాశీనత చూపిస్తున్నారని స్థానిక ప్రజల ప్రశ్నిస్తున్నారు. వీరి అక్రమార్చనకు పక్కదారి పడుతున్న ప్రభుత్వ సంకల్పం అని వాపోతున్నారు.

# డ్రగ్స్ నివారణకై నూజివీడులో త్రివర్ణ పతాకంతో భారీ ర్యాలీ


**ఈనెల 12 న రాష్ట్రవ్యాప్తంగా దండి మార్చ్ 2.0**






**నూజివీడు, మార్చి 10 వార్తాప్రభ :** నూజివీడు నియోజకవర్గం లో "వైబ్రంట్స్ ఆఫ్ కలాం"ఆర్గనైజేషన్ వారు ఈ నెల 12వ తేదీన నిర్వహించే మాదక ద్రవ్య వ్యతిరేక ఉద్యమం "దండి మార్చ్ 2.0"కార్యక్రమం గురించి 500 మంది విద్యార్థులు మంగళవారం శ్రీ శారద కళాశాల విద్యార్థులు 100 మీటర్ల త్రివర్ణ పతాకం తో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీ శారద విద్యాసంస్థల డైరెక్టర్ కుప్పాల శంకర్రావు, కలాం ఆర్గనైజేషన్ నూజివీడు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ కట్టుబోయిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలోని ద్వారకా సెంటర్, స్థానిక పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా, శ్రీకృష్ణ యూనివర్సిటీ పీజీ సెంటర్, ఎల్ఐసి కార్యాలయం మీదగా భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం శారద విద్యాసంస్థల డైరెక్టర్ శంకరరావు మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు గంజాయి, పొగాకు ఉత్పత్తులు, మద్యం వంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడకూడదు అన్నారు. ఇటీవల గంజాయి ఇక్కడ అక్కడ అనే తేడా లేకుండా దేశవ్యాప్తంగా ఇతర ప్రాంతాల నుంచి రవాణా జరగడం వలన చాలామంది యువత వాటి బారిన పడి జీవచ్ఛవాలుగా మారుతున్నారని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మన యువతకు మంచి ఉద్యోగ , ఉపాధి కల్పనలో మంచి డిమాండ్ ఉందన్నారు. ఇదే అదునుగా కొన్ని దేశాల వారు ఈర్ష్యతో భారతదేశ యువతపై గురి పెట్టారని అన్నారు. పెద్ద ఎత్తున యువతను నిర్వీర్యం చేసేందుకు అంతర్జాతీయంగా కుట్రలు జరుగుతున్నాయని కొన్ని నివేదికల ద్వారా తెలుస్తుంది అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు . పాఠశాల, కళాశాలలో విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు విద్యార్థులను వ్యక్తిగతంగా పరిశీలించాలన్నారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడితే వారి పరిస్థితి చాలా ప్రమాదకరంగా మారుతుంది అన్నారు. ఆ తర్వాత కుటుంబానికి సమాజానికి ఎంతో చేటు కలుగుతుందన్నారు. తరగతి గదిలో విద్యార్థులను పసిగట్టి ఉపాధ్యాయుల దృష్టికి సహవిద్యార్థులు తీసుకురావాలన్నారు. ఇంటి దగ్గర తల్లిదండ్రులు విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉంటూ వారిని తల్లిదండ్రులు గమనించాలన్నారు. ఈనెల 12వ తేదీన కలాం ఆర్గనైజేషన్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషదాయకమన్నారు. అనంతరం నూజివీడు నియోజకవర్గ కేంద్రం నూజివీడు పట్టణంలో శ్రీ శారద డిగ్రీ కాలేజ్ వారిని కలిసి, వివరించి ఆహ్వాన పత్రిక అందించి, కళాశాలలో 500 మంది డిగ్రీ విద్యార్థులచే పోస్టర్ లాంచింగ్ 100 మీటర్ల త్రివర్ణ పతాకం ట్రయిల్ కార్యక్రమం చేయడం జరిగింది . ఇంకా పిల్లలకు మాదకద్రవ్యాల వలన జరిగే నష్టాలను వివరిస్తూ, అవగాహన కార్యక్రమంను, నూజివీడు నియోజకవర్గ కోఆర్డినేటర్ కట్టుబోయిన శ్రీనివాసరావు , ఉమ్మడి కృష్ణాజిల్లా నియోజకవర్గ కోఆర్డినేటర్ బట్టపర్తి రాజు జరిపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ శారద విద్యాసంస్థల డైరెక్టర్ కుప్పాల శంకర్రావు, పలువురు విద్యార్థిని విద్యార్థులు డ్రగ్స్ నివారణ పై వారి అభిప్రాయాలను తెలియజేసి, ప్రసంగించారు. విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా డ్రగ్స్ వాడకం నిలిపేయాలంటూ, అవి యువతరానికి గొడ్డలిపెట్టుగా మారిందని నినాదాలు చేశారు.

# భగవంతుని నామము



మధురము మధురము
మధురము
దేవుని నామము మధురము
చేస్తేనే గనుక ధ్యానము
నెమ్మది నొందును హృదయము
దైవ నామమే ముత్యము
అన్నింటి కన్న శ్రేష్టము
పూజించాలోయ్! నిత్యము
అదే ఆగునోయ్! దుర్గము
ఎల్లవేళలా అండగా
జీవితాల్లో కొండగా
పవిత్రమైన నామము
కల్గియుంటే లాభము
భగవంతుని ఘన నామము
కలుగజేయును క్షేమము
ఆశ్రయిస్తే తోడుగా
ఉండును ప్రియ మిత్రునిగా

**-గద్వాల సోమన్న,**
గణితోపాధ్యాయుడు,
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# యనమదలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**రైతులకు పాసు పుస్తకాలు పంపిణీ చేసిన మంత్రి ఆనం**





**చేజర్ల మార్చి 10 (వార్తాప్రభ)** నెల్లూరు జిల్లా చేజర్ల మండలంలోని యనమదల గ్రామ పంచాయతీలో మంగళవారం రైతులకు పాసు పుస్తకాలు పంపిణీ మరియు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొన్నారు.రీసర్వే అనంతరం గ్రామంలో 202 డిజిటల్ పాస్ పుస్తకాలను అందించే కార్యక్రమం మీ భూమి మీ హక్కు కార్యక్రమం లో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాల్గొని రైతులకు అందించారు. అనంతరం గ్రామంలో 18 లక్షలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డుకు ప్రారంభోత్సవం చేశారు. వాటితో పాటు గ్రామంలో రైతులు నిర్మించుకున్న 6 గోకులం షెడ్లను ప్రారంభోత్సవము చేశారు.అలాగే మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు.గ్రామంలోని శ్రీ గంగమ్మ తల్లి దేవస్థానం ప్రహారి గోడ నిర్మాణానికి శంకుస్థాపన గావించారు.వీటితో పాటు ఈ మండలంలోని పలువురు వైద్య చికిత్సలు చేయించుకున్న వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 8.53 లక్షల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం తమ ముఖ్యమంత్రి కూటమి నేతలతో కలుపుకొని ఎంతో కృషి చేస్తున్నారని సంక్షేమ పథకాలు పై ప్రత్యేక దృష్టి సారించి వేటిని కూడా నిలుపుదల చేయకుండా కొనసాగిస్తున్నామని అన్నారు.

# కొండపల్లి మున్సిపల్ కమిషనర్ గా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరణ



**ఇబ్రహీంపట్నం, మార్చి 10 (వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి మున్సిపల్ కమిషనర్ గా బి.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి ఎంపీడీవోగా పనిచేస్తున్న ఈయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్ గా ఉన్న వెంకటరత్నం తిరిగి మేనేజర్ గా వెళ్లారు. నూతన కమిషనర్ ను జనసేన పార్టీ నాయకులు, మున్సిపల్ కార్యాలయ, సచివాలయ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


# తిరుమల అన్నదాన సత్రానికి కూరగాయల లారీ పంపిణీ.

**పరాస్ పేట శ్రీ సువర్చలా సమేత ఆంజనేయస్వామి దేవాలయం నుండి ఘనంగా పంపిణీ చేసిన ఆలయ ఈవో.**



**మచిలీపట్నం మార్చి 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక పరాసుపేటలో వెలసిన శ్రీ సువర్చలా సమేత ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో రెండవ మంగళవారం నాడు విశేష సేవా కార్యక్రమం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం కి అన్నదాన నిమిత్తం, ఆలయ కమిటీ సభ్యులు ఐలా శివనాగేశ్వరరావు కుమారుడు దుర్గా సాయి మారుతీ, శ్రీకృష్ణ కుమార్, భక్త బృందం ఆధ్వర్యంలో ఒక లారీ కూరగాయలను తిరుమలకు పంపించడం జరిగింది. దేవస్థాన ఈవో తిక్కిశెట్టి వీర వెంకట మోహన రావు, చైర్మన్ ఆలపాటి రమేష్ పాలకవర్గ సభ్యులు విశ్వనాథపల్లి నాగరాజు,మానేపల్లి ఉషారాణి,మోపర్తి ఉమాదేవి, నందిపాముల శ్రీనివాస్ ఆలయ అర్చకులు అగ్నిహోత్రం ప్రసన్న కుమార్, అగ్నిహోత్రం బదరి నాథ్, ముఖ్య అతిథులంతా జెండా ఊపి కూరగాయల లారీని తిరుమల క్షేత్రానికి పంపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల సమక్షంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

# 10వ తరగతి విద్యార్థులకు ఎగ్జాం కిట్స్ పంపిణీ



**కోడూరు, మార్చి 10( వార్తా ప్రభ) :**జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల,లింగారెడ్డి పాలెం నందు 10వ తరగతి చదువుతూ పబ్లిక్ పరీక్షలకు హాజరు కాబోతున్న విద్యార్థులకు అవసరమయిన పరీక్షా సామాగ్రిని మండల ఆర్యవైశ్య సంఘం మరియు వాసవి క్లబ్ కోడూరు వారి ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు అన్నం శ్రీనివాసు చేతుల మీదుగా అందించడం జరిగింది.పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు. నూరు శాతం ఉత్తీర్ణతతో పాఠశాలకు,తమ గ్రామానికి మంచి పేరు తేవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు కుంభా శివరామప్రసాద్ , కె.ఆర్. కె.శర్మ , ఏం.సుబ్బారావు ఇతర ఉపాధ్యాయులు మరియు వాసవి క్లబ్ జోన్ చైర్మన్ కోడూరు వెంకట సత్యనారాయణ , వాసవి సేవాదళ్ అధ్యక్షులు అద్దేపల్లి సత్యనారాయణ , మామిడి జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# పరీక్ష అంటే భయం వద్దు.. విజయమే నీ లక్ష్యం!!




పరీక్ష అంటే భయం ఎందుకు? అది నీ ప్రగతికి వారధి కాదా!!
జ్ఞానపు శిఖరం చేరాలంటే, అది నీవు ఎక్కాల్సిన మెట్టు కాదా!!
పుస్తకం అంటే భారమనుకోకు, అది నీ గమ్యం చూపే నేస్తం
చదువును చూసి పారిపోకు, అదే నీ రేపటి వెలుగుల హస్తం!!
ఆందోళనతో గందరగోళం చెందితే, తెలిసిన జవాబు మరుపే కదా
ప్రశాంతంగా శ్వాస తీసుకో, నీ మేధస్సు అప్పుడు అద్భుతం కదా!!
ప్రశ్నపత్రాన్ని ఒక్కసారి కాదు, రెండుసార్లు నిదానంగా చదువు
అర్థం చేసుకుని అడుగు వేస్తే, అపజయమనే మాటే రాదు!!
సమయపాలన నీ ఆయుధమవ్వాలి, ఏకాగ్రత నీ కవచమవ్వాలి
కలం సాగాలి గలగలా, నీ ఆలోచనలు మారాలి అక్షరాలుగా!!
ఇష్టపడి చదువు.. కష్టపడి కాదు, అప్పుడే విద్య నీ సొంతం
ఆత్మవిశ్వాసం తోడైతే, ఏ పరీక్ష అయినా నీకు అత్యంత సులభం!!
ఓటమికి తావు లేదు, నీ కృషిలో నిజాయితీ ఉంటే
గెలుపు నీ బానిసవుతుంది, నీలో పట్టుదల నిండి ఉంటే!!
వెరవకు.. బెదరకు.. సాగిపో ముందరకే వీరుడిలా
చరిత్ర సృష్టించు ఈ పూట, ఒక ధీర విద్యార్థిలా!!

**గడ్డం సంతోష్ రాజ్**
గోదావరిఖని

# నిర్లక్ష్యంతో కుదేలవుతున్న ఆర్ఎఫ్‌సీఎల్!!

● రైతు గోస పట్టని కేంద్రం ● 70 శాతానికే పరిమితమైన ఉత్పత్తి ● నిర్వహణ లోపం -- పాలకుల నిర్లక్ష్యం ● హెడ్ ఆఫీస్ తరలింపుపై కేంద్రం మొండిచేయి ● కొకా ఆశయాలకు గండి కొడుతున్న బీజేపీ ● పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ధ్వజం






**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 10 (వార్తాప్రభ ప్రతినిధి)**పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ రామగుండం ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థ నిర్వహణలో బీజేపీ ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సంస్థలో జరుగుతున్న మిస్ మేనేజ్‌మెంట్‌పై కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు పలుమార్లు లేఖలు రాసినా, వ్యక్తిగతంగా కలిసి వివరించినా ఫలితం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్లాంట్ తన పూర్తి సామర్థ్యంలో కేవలం 70 శాతం ఉత్పత్తితోనే నడుస్తోందని, ఢిల్లీలో ఉన్న హెడ్ ఆఫీస్‌ను హైదరాబాద్‌కు మార్చాలన్న విజ్ఞప్తిని కేంద్రం తిరస్కరించడం వల్ల పర్యవేక్షణ లోపించిందని విమర్శించారు. గతంలో ఈ సంస్థ పునరుద్ధరణ కోసం మాజీ కేంద్ర మంత్రి జి. వెంకటస్వామి (కాకా) అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌తో చర్చించి ఎంతో కృషి చేశారని, ఆ తర్వాత వివేక్ వెంకటస్వామి ఎంపీగా ఉన్నప్పుడు శ్రమించి ప్రొడక్షన్‌లోకి తీసుకువచ్చారని గుర్తు చేశారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించే ఈ సంస్థ ద్వారా తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు యూరియా సరఫరా అయ్యేదని, కానీ ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వ గందరగోళ నిర్ణయాల వల్ల ఉత్పత్తి తగ్గి రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. దేశీయ ఉత్పత్తిని పెంచకుండా ఇంపోర్టులపై ఆధారపడుతూ తెలంగాణ రైతులకు నష్టం కలిగిస్తున్నారని, ఈ అంశంపై రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆపేది లేదని ఎంపీ వంశీకృష్ణ స్పష్టం చేశారు.

## నల్ల చెరువు ప్రారంభోత్సవం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కొలన్ హన్మంత్ రెడ్డి ఘన స్వాగతం

<u>హైడ్రా ఆధ్వర్యంలో 30 ఎకరాలకు విస్తరించిన నల్ల చెరువు పునరుద్ధరణ.</u>
<u>ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికిన కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇంచార్జ్.</u>
<u>పర్యాటక కేంద్రంగా మారిన చెరువు.. స్థానికులకు నూతన ఉల్లాస కేంద్రం.</u>



**కూకట్పల్లి, మార్చి 10, (వార్తాప్రభ) :** కూకట్‌పల్లి నియోజకవర్గంలో హైడ్రా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పునరుద్ధరించిన నల్ల చెరువు ప్రారంభోత్సవ వేడుక సోమవారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి కి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఒకప్పుడు 16 ఎకరాలకు కుంచించుకుపోయిన నల్ల చెరువును ఆక్రమణల నుంచి కాపాడి, నేడు 30 ఎకరాల విస్తీర్ణంతో అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. నగరంలోని చెరువులను కాపాడుకోవడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతని, భవిష్యత్తులో వరద ముప్పు తప్పించడానికే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు** సుమారు 1.5 కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్, బోటింగ్ సదుపాయాలతో నల్ల చెరువు సరికొత్త రూపును సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో హన్మంత్ రెడ్డి పాల్గొని, ముఖ్యమంత్రితో కలిసి చెరువు పరిసరాలను పరిశీలించారు. నియోజకవర్గాల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా నిధులు కేటాయిస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీపై హన్మంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

<u>ఆటపాటలతో సరదాగా గడిపిన మహిళలు</u>



**కుత్బుల్లాపూర్, మార్చి 10, (వార్తాప్రభ) :** శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సూరారం కాలనీ, జై శ్రీరామ్ నగర్ లోని లూయిస్ బ్రెయిలి భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ నాయకుడు వారాల వినోద్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం డిప్యూటీ ఎంఆర్ఓ పున్నమరాజు నాగజ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథుల చేతులమీదుగా బ్రాహ్మణ మహిళలను శాలువాలతో ఘనంగా సత్కరించి, చీరలను అందజేశారు. మహిళలకు ప్రత్యేకంగా ఆటపాటలు, వినోద కార్యక్రమాలు నిర్వహించడంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా కొనసాగింది. మహిళలు ఆనందంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. బీఆర్ఎస్ నాయకుడు వారాల వినోద్ మాట్లాడుతూ.. మహిళలు విద్య, ఉద్యోగం, సామాజిక సేవ వంటి అన్ని రంగాలలో విశేష ప్రతిభ కనబరుస్తున్నారని చెప్పారు. మహిళలకు సమాజంలో మరింత గౌరవం, అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం డిప్యూటీ ఎంఆర్ఓ పున్నమరాజు నాగజ్యోతి మాట్లాడుతూ, మహిళలు కుటుంబానికి అండగా నిలబడటమే కాక సమాజంలో మార్పుకు దారితీసే శక్తిగా నిలుస్తున్నారని తెలిపారు. మహిళలకు విద్య, స్వావలంబన, నాయకత్వ లక్షణాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని ఈ విధంగా నిర్వహించడం ఆనందంగా ఉందని, సంఘం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ.. మహిళలు కుటుంబానికి మాత్రమే కాక సమాజ నిర్మాణానికి కూడా బలమైన ఆధారం అని తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో ముందంజలో నిలుస్తూ సమాజ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళలను గౌరవించడం, వారికి ప్రోత్సాహం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మహిళల ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక మహిళలు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు సర్వేపల్లి రమేష్ కుమార్, మహిళా విభాగం ప్రతినిధులు మాలతి, రేఖాజ్యోతి, లక్ష్మి కుమారి, గీత, సాయి సుందరి, శ్రావణి, హైమ, రామసీత, సునీత, ఉమాదేవి, శ్రీధరాచార్యులు, శివభాస్కర్, జగదీశ్, హరీరాఘవేంద్ర, సీనియర్ నాయకులు రాజ్ కుమార్, సత్యనారాయణ, కిషోర్, చంద్రశేఖర్, వేణు ముదిరాజ్, అనిల్, రామకృష్ణ తో పాటు సంఘ మహిళా విభాగ సభ్యులు, సంఘ ప్రతినిధులు మరియు స్థానిక మహిళలు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## సర్పంచ్ లకు ఎంపీపీ ఘన సత్కారం



**ఇబ్రహీంపట్నం, మార్చి 10 (వార్తా ప్రభ ప్రతినిధి):** ఇబ్రహీంపట్నం మండల కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశం అనంతరం మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచ్ లను ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న దుర్గా ప్రసాద్ ఘనంగా సత్కరించారు.గత కొన్ని సంవత్సరాలుగా వారితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మరో నెల రోజుల్లో సర్పంచ్ ల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో మండల పరిషత్ చివరి సమావేశానికి హాజరైన సర్పంచ్ లను దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేసి అభినందించారు.ఇన్నాళ్లు వారితో కలిసి పనిచేయటం ఎంతో సంతోషకరంగా ఉందని అన్నారు. సర్పంచ్ లు మాట్లాడుతూ ఎంపీపీగా తమకు అన్ని విధాల సహకరించిన పాలడుగు జోత్స్న కు ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బండి నాగమణి, బాణావత్ నాగ బాలమ్మ, తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎంపీడీవోలు మనోజ్, ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పరిశ్రమల రక్షణలో వజ్రాయుధం సీఐఎస్ఎఫ్!!

● కంపెనీల భద్రతలో సీఐఎస్ఎఫ్ పాత్ర అనన్యం!! ● ఎన్టీపీసీలో ఘనంగా సీఐఎస్ఎఫ్ రైజింగ్ డే వేడుకలు ● కనువిందు చేసిన సీఐఎస్ఎఫ్ పరేడ్ ● ఆకట్టుకున్న రూమ్ ఇంటర్వెన్షన్ డెమో ● శత్రువుకు సింహస్వప్నం.. భద్రతకు కేరాఫ్ అడ్రస్ ● ఈడీ చందన్ కుమార్ సమంత





**పెద్దపల్లి/ ఎన్టీపీసీ: మార్చి 10 (వార్తాప్రభ ప్రతినిధి)**పరిశ్రమల రక్షణలో వజ్రాయుధం సీఐఎస్ఎఫ్ అని ప్రశంసించారు రామగుండం ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సమంత. ఈ మేరకు మంగళవారం రామగుండం ఆర్ఎస్టీపీఎస్ సీఐఎస్ఎఫ్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం సీఐఎస్ఎఫ్ 57వ రైజింగ్ డే వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సాంప్రదాయిక సెరిమోనియల్ పరేడ్‌కు ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంతా ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. కమాండెంట్ చంచల్ సర్కార్, డిప్యూటీ కమాండెంట్లు ఎస్.ఏ. రాజు, ఓ.వి.కె.ఎస్. శాస్త్రి అతిథులకు సాదర స్వాగతం పలికారు. వేడుకల్లో భాగంగా సీఐఎస్ఎఫ్ సిబ్బంది ప్రదర్శించిన కవాతు వారి క్రమశిక్షణను, వృత్తి నైపుణ్యాన్ని చాటిచెప్పగా, రూమ్ ఇంటర్వెన్షన్ డెమో వారి ఆపరేషనల్ సిద్ధతను ప్రతిబింబించింది. ఈ సందర్భంగా ఉత్తమ పరేడ్ కమాండర్, ప్లాటూన్‌లకు ముఖ్య అతిథి బహుమతులు అందజేసి అభినందించారు. దేశ ఆర్థిక ప్రగతికి వెన్నెముకగా నిలిచే కీలక పరిశ్రమల రక్షణలో సీఐఎస్ఎఫ్ పోషిస్తున్న పాత్ర అనిర్వచనీయమని అతిథులు కొనియాడారు. ఎన్టీపీసీ ఉన్నతాధికారులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమం దేశ సేవలో బలగం యొక్క నిబద్ధతను మరోసారి చాటింది. ఈ వేడుకలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి.

## వివేక్ కు మున్సిపల్ చైర్మన్ అభినందనలు

<u>పవర్ లిఫ్టింగ్ ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ కు అర్హత సాధించిన వివేక్</u>



**ఇబ్రహీంపట్నం, మార్చి 10(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి కి చెందిన వివేక్ ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా మంగళవారం నాడు కొండపల్లి మున్సిపల్ చైర్మన్ మరియు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు వివేక్ ను అభినందించారు. శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. జవహర్ లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ కాకినాడ ఆధ్వర్యంలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీలలో వివేక్ విశేష ప్రతిభ కనబరిచాడు. 83 కిలోల విభాగంలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీలో బంగారు పతకం సాధించాడు. వివేక్‌కు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభించింది.ఈ సందర్భంగా కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ చిట్టిబాబు మరియు మున్సిపల్ కౌన్సిలర్లు వివేక్‌ను అభినందిస్తూ, ప్రశంసించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షిస్తూ, అతనికి తమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, కౌన్సిలర్లు చనుమోలు నారాయణరావు, షేక్ రసూల్, ధరణికోట విజయలక్ష్మి, టిడిపి నాయకులు పులి దాస్ పాల్గొన్నారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక: గాజులరామారంలో ఇంటింటికీ చెత్త సేకరణపై ప్రత్యేక నిఘా!

● 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 5వ రోజు ముమ్మరంగా సాగిన తనిఖీలు.
● చెత్త ఆటోలకు వ్యర్థాలను అప్పగించని ఇళ్ల గుర్తింపు.. అవగాహన కల్పించిన అధికారులు.
● సూరారం, షాపూర్‌నగర్ సహా పలు కాలనీల్లో పర్యటించిన డెప్యూటీ కమిషనర్ శ్రీపాద రామేశ్వర్.















**గాజులరామారం, మార్చి 10, (వార్తాప్రభ) :** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా మంగళవారం గాజులరామారం సర్కిల్ పరిధిలో ఐదవ రోజు కార్యకలాపాలు ముమ్మరంగా సాగాయి. షెడ్యూల్ ప్రకారం మంగళవారం "చెత్త ఆటోల ద్వారా వ్యర్థాలను పారవేయని కుటుంబాల గుర్తింపు" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని పలు కాలనీల్లో నిర్వహించారు.

**క్షేత్రస్థాయిలో తనిఖీలు - కుటుంబాల గుర్తింపు** డెప్యూటీ కమిషనర్ శ్రీపాద రామేశ్వర్ పర్యవేక్షణలో సూరారం గ్రామం, హెచ్.ఎమ్.టి సొసైటీ, షాపూర్‌నగర్, దేవేందర్ నగర్, సుభాష్ చంద్రబోస్ నగర్ మరియు పీపీ నగర్ కాలనీలలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణను పరిశీలించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు లేదా ఆటోలకు చెత్తను అప్పగించని ఇళ్లను అధికారులు ప్రత్యేకంగా గుర్తించారు.

**పరిశుభ్రతపై అవగాహన** వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారవేయడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, మున్సిపల్ పారిశుధ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నివాసితులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య అధికారులు, యూసీడీ ఆర్పీలు, ఎస్.హెచ్.జి మహిళా గ్రూపులు మరియు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హెల్మెట్ తలకు కాదు కుటుంబానికి రక్షణ

<u>ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు</u>
<u>ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సీ ఐ డి చంద్రశేఖర్</u>



**ఇబ్రహీంపట్నం, మార్చి 10 (వార్తా ప్రభ ప్రతినిధి):** హెల్మెట్ అనేది కేవలం తలకు మాత్రమే రక్షణ కాదని అది కుటుంబాలను కాపాడే రక్షణ కవచంగా పనిచేస్తుందని అన్నారు ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సీ ఐ డి చంద్రశేఖర్. మంగళవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ లో నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని తెలిపారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నంలో ప్రాంతంలో ట్రాఫిక్ పెరిగిందని, సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఆర్ ఎస్ ఐ బి లక్ష్మణరావు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేట కే.జి.బి.వి లో బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

<u>6వ మరియు ఇంటర్ లో ప్రవేశాలకు ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవాలి... ప్రిన్సిపాల్ లక్ష్మమ్మ</u>



**అనుమసముద్రంపేటమార్చి 10 (వార్తాప్రభ)** ఏఎస్ పేట మండలంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఆరో తరగతి నుండి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కొరకు ఆన్లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మమ్మ తెలిపారు.మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల మార్చి 12వ తేదీ నుండి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు ఏపీ కేజీబీవీ.ఏపీసిఫ్ఎస్ఎస్.ఇన్ ఆన్లైన్ వెబ్సైట్ ద్వారా బాలికల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్టు తెలిపారు.అలాగే ఆరో తరగతిలో 40 సీట్లు ఏడో తరగతిలో 6 సీట్లు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో (బైపీసీ) 40 సీట్లు ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 2 సీట్లు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు.ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న బాలికలు వివరాలను ఏప్రిల్ 13,వ తేదీ తుది జాబితాను ప్రకటిస్తారని తెలిపారు.మా వద్ద నాణ్యమైన ఉచిత విద్య,ఉచిత హాస్టల్ వసతి తోపాటు పాఠ్యపుస్తకాలు యూనిఫామ్ ఉచితంగా అందిస్తామన్నారు.అలాగే ఆరు నుండి ఇంటర్ వరకు ఇంగ్లీష్ మీడియం లో మాత్రమే బోధించడం జరుగుతుందని తెలిపారు.ఇంటర్ విద్యార్థినిలకు పాల్ ల్యాబ్ సైన్స్ ల్యాబ్ లైబ్రరీ వంటి ప్రత్యేక సౌకర్యాలు ఉన్నాయన్నారు. పాఠశాల మొత్తం సీసీ కెమెరాల నిఘానేత్రంలో ఉంటుందన్నారు. ఈ అవకాశని బాలికల తల్లిదండ్రులు సీసీవిద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

# ఏపీ, తెలంగాణ వ్యాప్తంగా ఎన్‌బీబీఎల్ భారత్ కనెక్ట్‌లో ఈ చలాన్ చెల్లింపులకు పెరుగుతున్న ఆదరణ

**విజయవాడ,మార్చి 10 (వార్తాప్రభ) :** నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కి చెందిన పూర్తి అనుబంధ సంస్థ ఎన్‌పీసీఐ భారత్ బిల్‌పే లిమిటెడ్ (ఎన్‌బీబీఎల్) తమ భారత్ కనెక్ట్ ప్లాట్‌ఫామ్‌లో ప్రవేశపెట్టిన ఈ చలాన్ సేవకు మంచి స్పందన లభిస్తున్నట్లు ఎన్‌బీబీఎల్ (ఎన్ బీబీఎల్ ) ప్రతినిధి నూపూర్ చతుర్వేది తెలిపారు. 2025 అక్టోబర్‌లో ప్రారంభమైనప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్ ట్రాఫిక్ పోలీస్ విభాగంలో 4.5 లక్షలకు పైగా ఈ చలాన్ లావాదేవీలు నమోదయ్యాయన్నారు. తెలంగాణ ట్రాఫిక్ పోలీస్ పరిధిలో 1.3 లక్షలకు పైగా లావాదేవీలు నమోదయ్యాయని, ఈ సేవకు ఆదరణ మరింత పెరుగుతోందన్నారు. 2026 ఫిబ్రవరి నెలలోనే ఆంధ్రప్రదేశ్‌లో ఏకంగా 1,02,096 లావాదేవీలు, తెలంగాణలో 22,882 లావాదేవీలు నమోదయ్యాయన్నారు. భారత్ కనెక్ట్ ద్వారా ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించిన జరిమానాలను సులభంగా గుర్తించి డిజిటల్‌గా చెల్లించే సౌకర్యం అందుబాటులోకి రావడంతో ఈ వృద్ధి కనిపిస్తోందని, దీనిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు హైదరాబాద్‌లో డ్రోన్ ప్రచారం కూడా నిర్వహించారన్నారు. ప్రధాన ట్రాఫిక్ కూడళ్ల వద్ద ఇంటరాక్టివ్ స్క్రీన్‌లను డ్రోన్‌ల ద్వారా ప్రదర్శిస్తూ ఈ చలాన్ సేవపై ప్రచారం చేశారని, భారత్ కనెక్ట్‌లో ఈ చలాన్ కేటగిరీ గురించి ఈ నగరవ్యాప్త ప్రచార కార్యక్రమం మరింతగా అవగాహన పెంచిందన్నారు. వినియోగదారులకు పరిమిత స్థాయిలో డిజిటల్ ఆప్షన్లు ఉండటం వల్ల సాధారణంగా చలాన్ చెల్లింపులు డిజిటల్ రూపంలో ఎక్కువగా అందుబాటులో ఉండేవి కావు. ప్రజలు ఎక్కువగా నగదు ద్వారా లేదా చలాన్ ఇచ్చిన చోట ఉన్న పీ ఓ ఎస్ యంత్రాల ద్వారా, లేదా రాష్ట్రాల వారీగా వేర్వేరు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా చెల్లించేవారని, ఇప్పుడు ఎన్ బీబీఎల్ ఈ చలాన్ విభాగం ద్వారా ఒకే ప్రామాణికమైన, విశ్వసనీయమైన ప్లాట్‌ఫామ్‌లో చలాన్ వివరాలను తెలుసుకుని చెల్లించే అవకాశం పౌరులకు లభిస్తోందన్నారు. ఇది ప్రభుత్వ సేవలను డిజిటలైజ్ చేసే దిశగా ఇది ఒక ముఖ్యమైన ముందడుగు. డిజిటల్ చెల్లింపుల సామర్థ్యాలను ప్రభుత్వ సేవల జవాబుదారీతనం, భద్రతతో మేళవించి భారత్ కనెక్ట్ పౌరులకు డిజిటల్, సహాయక ఛానెల్‌ల ద్వారా సౌకర్యవంతమైన చెల్లింపు ఆప్షన్లను అందిస్తోంది."భారత్ కనెక్ట్‌లోని ఈ చలాన్ సేవ కేవలం డిజిటల్ అప్‌గ్రేడ్ మాత్రమే కాదు. ప్రజలకు అందించే ప్రభుత్వ సేవలను సరికొత్తగా నిర్వచించేందుకు వీలవుతుందని తెలియజెప్పేందుకు ఇదొక శక్తివంతమైన ఉదాహరణ అన్నారు. ఈ ప్రయత్నంలో తమకు సహకరించిన ఆంధ్రప్రదేశ్ ట్రాఫిక్ పోలీస్, తెలంగాణ ట్రాఫిక్ పోలీస్ శాఖలకు సందర్భంగా కృతజ్ఞతలు చెప్పారు. ఎన్ బీబీఎల్ ప్రస్తుతం 700కి పైగా భారత్ కనెక్ట్ యాప్‌లు, బ్యాంకులు, ఏజెంట్ల ద్వారా ఈ సేవ అందుబాటులో ఉందని, ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు ఢిల్లీ, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా ఈ సేవ ప్రారంభమైంది. ఈ చలాన్ విభాగం పౌరులకు వెసులుబాటును పెంచడమే కాకుండా, దేశవ్యాప్తంగా విస్తరించగల నమూనాగా మారే అవకాశముందని చెప్పారు.

# వేసవి గాలులను మించి రాజకీయ గాడుపు మొదలైంది




**విస్సన్నపేట,మార్చి 10 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో వార్డు స్థాయి నుండి మండల స్థాయి వరకు ఈ గట్టున కూటమి అవతలి గట్టున వైసిపి పోల్ మేనేజ్మెంట్ లో ఉన్న అపార అనుభవంతో పావులు కదుపుతున్నట్లు సర్వత్రా వినిపిస్తోంది. ఇప్పటికే అధికార టిడిపి పార్టీ మండల కార్యాలయం ప్రారంభించడం తోపాటు నియోజకవర్గస్థాయి పార్లమెంట్ స్థాయి ప్రజాప్రతినిధులతో వార్డు స్థాయి నాయకుడు దగ్గర నుండి ప్రతి ఒక్కరితో ప్రత్యక్షంగా ముఖాముఖి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం తోపాటు బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు బండ టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు ఆధ్వర్యంలో బూత్,యూనిట్, క్లస్టర్ ఇన్చార్జి లతోపాటు గ్రామాల వారీగా అధ్యక్ష కార్యదర్శులు మరియు కార్యవర్గం మండల పార్టీ కమిటీలు జిల్లా మరియు నియోజకవర్గ బాధ్యులు జిల్లా నియోజకవర్గ మండల అనుబంధ సంఘాలు విద్యా కమిటీలు నీటి సంఘాలు వివిధ హోదాలలో ఉన్న నాయకులు కార్యకర్తలు అందరికీ ఆహ్వానాలు పంపి భారీ ఎత్తున సమీకరణకు రంగం సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. మరోవైపు ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 13వ తేదీన పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ తోపాటు, జిల్లా నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్ది రెడ్డి సూర్యనారాయణ రెడ్డి, ఏ కొండూరు గంపలగూడెం తిరువూరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దలు జడ్పిటిసిలు తిరువూరు రామచంద్రారెడ్డి విస్సన్నపేట భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి, ఎంపీపీ గద్దల మల్లయ్య జిల్లా నాయకులు ప్రకాష్ లక్ష్మయ్య జయరాజు జయకర్ తిరుపతిరావు గ్రామ పార్టీల అధ్యక్ష కార్యదర్శులు జిల్లా నియోజకవర్గ మండల గ్రామ యూత్ కమిటీల నూతన నియామక పత్రాల పంపిణీ రాబోయే కాలంలో తిరువూరు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నల్లగట్ల స్వామి దాస్ సుధారాణి దంపతులు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఓలేటి దుర్గారావు, పట్టణ వైసిపి అధ్యక్షులు ఎన్వి కుటుంబరావు తదితరులు సారధ్యంలో వైసిపి పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంతో పాటు నియామక పత్రాలు అందజేత తదనంతరం వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్ది రెడ్డి సూర్యనారాయణ రెడ్డి సౌజన్యంతో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లుగా విశ్వసనీయ వర్గాల సమాచారం అందుతుంది. గ్రామ సర్పంచ్ ల పాలన చిట్ట చివర దశకు రావడంతో గ్రామపంచాయతీ, మండల ప్రజా పరిషత్,జడ్పిటిసి ఎన్నికలలో పూర్తి మెజార్టీతో అత్యధిక సీట్లు సాధించే లక్ష్యంగా కూటమి, నాన్ కూటమి పార్టీలు గజకర్ణ గోకర్ణ టక్కు టమారా ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ వైరీవర్గాలకు మించి ప్రవాసాంధ్రుల సహాయ సహకారాలతో ఓటు బ్యాంకు సాధించే లక్ష్యంగా గెలుపు గుర్రాలను రంగంలోకి దించేందుకు సాప కింద నీరులా స్కెచ్ వేస్తున్నట్టు పలువురు అనుకుంటున్నారు. రాజకీయ మేధావులు మాట్లాడే మాటలు తిరుపతి మహా ప్రసాదం లడ్డు అంశం, సమకాలీన రాజకీయ ఆర్థిక సామాజిక కారణాలు పలు లెక్కల ఆధారంగా గెలిచేది ఎవరో ఓడేది ఎవరు అనే వాడి వేడి చర్చలు రాజకీయ పరిజ్ఞానం కలిగిన వారిని సంబంధిత చర్చలు ఉక్కపోత కు గురి చేస్తున్నాయని పలుచోట్ల వినిపిస్తోంది.

# కోతులు, కుక్కల వల్ల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు

## అధికారులకు వినతి పత్రం అందజేసిన టీ.డి.పి. నాయకులు





**పెనుగంచిప్రోలు,మార్చి 10 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జి.శ్యామ్ కుమార్ కు, తహసీల్దార్ శాంతి లక్ష్మి కీ పెనుగంచిప్రోలు టీ డి పి నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పెనుగంచిప్రోలు గ్రామంలో విలయ తాండవం చేస్తున్న కోతులు మరియు కుక్కల నుండి రక్షణ చర్యల గురించి,గత కొంతకాలం నుండి పెనుగంచిప్రోలు గ్రామంలో కోతులు మరియు కుక్కల బెడద తీవ్రరూపం దాల్చినది.గతంలో మోడల్ కాలానికి చెందిన ఒక దళిత కుటుంబంలో 5 సంవత్సరాల పిల్లవాడు ఆడుకుంటుండగా కుక్కలు పిల్ల వాడిని తుప్పలల్లోకీ లాకెళ్లి చంపిన సంఘటనలు మర్చిపోకముందే, మూడు రోజుల క్రిందట పడమర బజార్ లోని మాలపల్లె లో జొన్నలగడ్డ రామనాథం అనే వ్యక్తిని 10 కోతులు దాడిచేసి అతనిని దారుణంగా గాయ పరచినవి.అదేవిధంగా కాకాని బజారు నందు ఒక మహిళను కోతులు మూకుమ్మడి దాడి చేసి కొరికి గాయపరచినవి. పై రెండు ఉదాహరణలు వెలుగులోనికి వచ్చినవి మాత్రమే. ఇంకా ఇలాంటి ఎన్నో సంఘటనలు రోజు ఎక్కడోఅక్కడ జరుగుతూనే ఉన్నాయి. కుక్కలు, కోతుల వలన గ్రామ రహదారుల వెంట ప్రజలు,ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు భయాందోళనలకు గురిఅగుతున్నారు.ఇది కాక రైతుల పంటలు, ముఖ్యంగా మామిడి, మొక్కజొన్న రైతులు వానర మూక ఆగడాలకు కుదేలావుతున్నాయి. రోజు కొన్ని వేల రూపాయల పంట నష్టం వీటి వలన జరుగుతున్నది. అందువలన దయచేసి వీటిని అరికట్టి రక్షణ చర్యలు తీసుకొని గ్రామ ప్రజల ధన, ప్రాణాలను కాపాడవలసినదిగా అంటూ తెలుగుదేశం పార్టీ విజయవాడ పార్లమెంటరీ పార్టీ అధికార ప్రతినిధి నలమోలు వెంకట శివరామ ప్రసాద్.తిరుపతమ్మ ఆలయ మాజీ చైర్మన్ కాకాని శ్రీ ని వాసరరావు, సోసైటీ మాజీ అధ్యక్షులు కొల్లా రఘు రామయ్య, నీటి సంఘం అధ్యక్షులు కర్ల నాగేశ్వరరావు, పోపూరి రమేష్ తదితరులు అధికారులను కోరారు.

# మార్కాపురం జిల్లాకు "కాటమరాజు జిల్లా"గా నామకరణం చేయండి

- అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చింకా నారాయణరావు విజ్ఞప్తి



**నర్సరావు పేట,మార్చి 10 (వార్తాప్రభ) :** అఖిల భారత యాదవ మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు చింకా నారాయణరావు యాదవ్ సారధ్యంలో పల్నాడు జిల్లాలోని కలెక్టర్ ఆఫీస్ నందు జరిగినటువంటి గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ సంజన సిన్హా కి మార్కాపురం జిల్లాని కాటమరాజు జిల్లాగా నామకరణం చేయాలని అఖిలభారత యాదవ మహాసభ ప్రతినిధులు రిప్రజెంటేషన్ ఇవ్వడం జరిగినది .ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చింకా నారాయణరావు యాదవ్, అఖిలభారత యాదవ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి కొక్కెర కొండలు యాదవ్, పల్నాడు జిల్లా యూత్ ప్రెసిడెంట్ జక్కుల కృష్ణ యాదవ్, రాజుపాలెం మండలం అఖిలభారత యాదవ మహాసభ ప్రెసిడెంట్ చింకా ప్రసన్న ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# ఘనంగా సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి కార్యక్రమం



**నందిగామ,మార్చి 10 (వార్తాప్రభ) :** నియోజకవర్గం నందిగామ గ్రంథాలయము నందు భారతీయ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 129 వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించి ఆమె చిత్రపటానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వీరంకి వీరాస్వామి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే గారు1831 సంవత్సరం జనవరి 3న మహారాష్ట్రలోని సతార్ జిల్లాలో జన్మించారని, ఆమె 9 సంవత్సరాల వయసులోనే జ్యోతిరావు పూలేతో వివాహం అయిందని, జ్యోతిరావు పూలే దగ్గర విద్యాభ్యాసం సావిత్రిబాయి పూలే చేశారన్నారు. మహిళ విద్యాభివృద్ధి కోసం ఈ దంపతులు ఇద్దరూ కృషి చేసినారు. 20 స్కూల్ వరకు ఏర్పాటు చేసి మహిళల విద్యాభివృద్ధికి కృషి చేశారని వీరాస్వామి పేర్కొన్నారు.బడుగు బలహీన వర్గాల మహిళల అభ్యున్నతి కోసం విద్యాభివృద్ధి ద్వారానే సాధ్యమని నమ్మి కృషి చేశారని, సావిత్రిబాయి పూలే 1897 మార్చి 10న పేగు వ్యాధిగ్రస్తులకు సహాయం చేసుకుంటూనే ఆ పేగు వ్యాధితో ఆవిడ మరణించినారు అని ఈ సందర్భంగా వీరాస్వామి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అల్లూరు రామచంద్రుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రసాద రావు, గ్రంథాలయం పాఠకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# విపత్తులపై విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎన్డీఆర్ఎఫ్ బృందం

## –జెడ్పి పాఠశాలలో మొక్కలు నాటిన ఎన్డీఆర్ఎఫ్ బృందం








**జి.కొండూరు,మార్చి 10 (వార్తాప్రభ) :** విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎన్డీఆర్ఎఫ్ బృందం సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు.స్థానిక మండల ప్రజా పరిషత్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఎన్డీఆర్ఎఫ్ టీం కమాండర్ భూపేంద్ర కుమార్, రిస్క్ కోర్స్ కె.వెంకటేశ్వర్లు జి.వెంకట్ లు విద్యార్థులకు విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఫస్ట్ ఎయిడ్ గురించి , సి పి ఆర్ ఏ విధంగా చేయాలి, భూకంపాలు, వరదలు, పిడుగుపాటు సమయాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అలాగే వాటి నుంచి మనల్ని మనం ఎలా రక్షించుకోవాలి, ఎదుట వారికి ఎలా సాయం చేయాలనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.అనంతరం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి–2 ఎం.వీరాస్వామి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మణిందర్ సింగ్, జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు శ్రీలత, ఎన్ డి ఆర్ ఎఫ్ బృందం, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, గ్రామ రెవెన్యూ అధికారులు విజయుడు,సింహాద్రి, వీఆర్ఏ లు మునియ్య,విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక విప్లవకారిణి మన సావిత్రిబాయి పూలే బహుజన దళిత ఐక్యవేదిక



**విస్సన్నపేట,మార్చి 10 (వార్తాప్రభ) :** మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్య పడటానికి 1852 సంవత్సరంలో మహిళా సేవా మండల్ అనే మహిళా సంఘాన్ని స్థాపించి కుల పితృ సౌమ్య వ్యవస్థల అణచివేతకు వ్యతిరేకంగా మహిళల సాధికారిక కొరకు కృషి చేసిన సామాజిక విప్లవకారణ మన జ్యోతిరావు పూలే సతీమణి సావిత్రిబాయి పూలే అని బహుజన దళిత ఐక్యవేదిక సభ్యులు చెప్పారు. మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినాదం చేసి సావిత్రిబాయి పూలే అసత్యాలతో అగ్రవర్ణ దురహంకారపు నిచ్చిన మెట్ల కుల వ్యవస్థగా నిర్మాణమైన సమాజంలో సత్యాన్ని సోదించడానికి 1873 సంవత్సరంలో తన భర్త మహాత్మా జ్యోతిరావు పూలే తో కలసి సత్యశోధకు సమాజం నో ప్రారంభించి బాల్య వివాహాలకు మూఢనమ్మకాలకు సతీసాగమనానికి వ్యతిరేకంగా వితంతువు పునర్వివాహాల కొరకు అసమాన బ్రాహ్మణ వ్యవస్థకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నడిపారని చెప్పారు. ఆమె నిజమైన మొదటి సంఘసంస్కర్త అనే సమాజం కోసం జీవించి సమాజం కోసం మరణించిన వ్యక్తులు మాత్రమే అసలైన సంఘసంస్కర్తలుగా పిలవబడతారని ఆ ప్రమాణానికి పూర్తిగా సరిపోయే తొలి మహిళా మూర్తి ఆమె అని వారన్నారు. 1848 సంవత్సరంలో పూణేలో మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించి ఆమె విద్యా బోధన చేశారని చెప్పారు. మార్చి 10 1897 సంవత్సరంలో ఆమె ప్లేగు వ్యాధితో మరణించారని ఆమె దత్తపుత్రుడు యశ్వంత్ అంత్యక్రియలు జరిపారని సావిత్రిబాయి జయంతిని భారతదేశం మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం గా జరుపుకోవడం జరుగుతుంది అని 1897 సంవత్సరంలో భారత ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జ్ఞాపకార్థం తపాళ్ళని విడుదల చేశారని పూనే విశ్వవిద్యాలయానికి సావిత్రిబాయి పేరు పెట్టడం జరిగిందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బహుజన దళిత ఐక్యవేదిక అధ్యక్ష కార్యదర్శులు ఎం శ్రీనివాసరావు, కొండా రాజకుమార్, ఎంపీపీ గద్దల మల్లయ్య, గొర్రె లాజర్, టి శ్రీను, పిల్లి రాజేష్, పల్లెపాశీ లక్ష్మయ్య, వసంతరావు,బాబు రాజేంద్రప్రసాద్, సూరి రాజు ధనరాజు పవన్,కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షన్‌లో కాకినాడకు మంచి ర్యాంకు సాధించేందుకు కృషి చేయాలి

## - జాయింట్ కలెక్టరు అపూర్వ భారత్



**కాకినాడ,మార్చి 10 (వార్తాప్రభ) :** స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా కాకినాడ నగరానికి మంచి ర్యాంకు వచ్చేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టరు అపూర్వ భారత్ సూచించారు. కాకినాడ స్మార్టు సిటీ కార్యాలయంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ అధ్యక్షతన స్వచ్ఛ స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సాలిడ్ వేస్టు మేనేజ్మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరంలోని సచివాలయ అడ్మిన్లు,మహిళా సంఘాల రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇంటి వద్దనే కంపోస్టు యార్డ్‌ను ఎలా ఏర్పాటు చేసుకోవాలి, తడి--పొడి చెత్తను వేరు చేసి నిర్వహించడం ద్వారా పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవచ్చనే అంశాలపై కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు. గృహ స్థాయిలోనే చెత్తను వర్గీకరించడం, కంపోస్టింగ్ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా నగర పరిశుభ్రతను మరింత మెరుగుపరచవచ్చని ఆయన తెలిపారు. జాయింట్ కలెక్టర్ అపూర్వ భారత్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్‌లో దేశవ్యాప్తంగా కాకినాడ నగరానికి మంచి ర్యాంకు సాధించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు చెత్త వర్గీకరణ, కంపోస్టింగ్ వంటి చర్యలను విస్తృతంగా అమలు చేయాలని పేర్కొన్నారు.అనంతరం మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలోని 233 మంది రిసోర్స్ పర్సన్లకు సస కిట్స్ ను పంపిణీ చేశారు. ఈ కిట్స్ ద్వారా రిసోర్స్ పర్సన్లు ప్రజల్లో పరిశుభ్రత, చెత్త నిర్వహణ,కంపోస్టింగ్ వంటి అంశాలపై మరింత అవగాహన కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్, డీసీపీ కృష్ణారావు,సిటి మిషన్ మేనేజర్ డి.వెంకట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా విద్యకు మార్గదర్శి సావిత్రిబాయి పూలే

- మహిళల జీవితాల్లో కాంతి జ్యోతి నింపిన ప్రేమ స్వరూపిణి
- వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్





**రామచంద్రపురం,మార్చి 10 (వార్తాప్రభ) :** విద్య ద్వారానే స్త్రీకి విముక్తి సాధ్యమని, మహిళల హక్కుల కోసం పోరాడిన భారతీయ తొలి ఉపాధ్యాయిని, కవయిత్రి, సామాజిక ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే నేటితరానికి ఆదర్శమని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం పేరుకొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే మహిళా విద్య అభివృద్ధికి చేసిన సేవలు అపారమని కొనియాడారు. సమాజంలో మహిళలకు విద్య అందేలా ఎన్నో అవరోధాలను ఎదుర్కొని పోరాడిన మహానుభావురాలు సావిత్రిబాయి పూలే అని అన్నారు. మహిళల సాధికారతకు, సమాన హక్కులకు ఆమె చేసిన కృషి భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. అలాంటి మహోన్నత మహిళను స్మరించుకోవడం ప్రతి ఒక్కరికీ గౌరవకరమని, ఆమె చూపిన మార్గంలో నడుస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. అనంతరం జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కేపీపీ ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు, తెలుగుదేశం పార్టీ రామచంద్రపురం పట్టణ ఉపాధ్యక్షులు చందమామ వాసు, ద్రాక్షారామం సొసైటీ అధ్యక్షులు ముప్పనపల్లి గణేష్, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు పెంకె సాంబశివరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ కంచుమర్తి బాబురావు, మాజీ కౌన్సిలర్ దంగేటి గౌరీశంకర్, యువ నాయకులు కుడుపూడి ఫణి తేజ, ప్రకాష్ కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌ఎంఎ డిసీజ్ ట్రీట్మెంట్ కు శ్రీశ్రీ విద్యాసంస్థలు 42000 వితరణ



**విస్సన్నపేట,మార్చి 10 (వార్తాప్రభ) :** తెలంగాణ రాష్ట్రం లోని మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సహస్ర (7) మహావీర్(4) లకు ఎస్ఎంఎ డిసీజ్ నివారణకు విరాళాలు సేకరిస్తున్న పూర్వ విద్యార్థులకు శ్రీశ్రీ విద్యాసంస్థల తరఫున భాగస్వామి ఎన్ వెంకట్ 42 వేల రూపాయలు రూపాయలు అందించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారులకు మేము సైతం అంటూ ఒకవైపు యాజమాన్యం మరోవైపు విద్యార్థిని విద్యార్థులు తమ ఉదారతను ప్రదర్శించటం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## గ్రామ పంచాయితీ కార్యాలయం, మల్లవోలు
### టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం. /2026 తేది : 10-03-2026

కృష్ణాజిల్లా, గూడూరు మండలం, మల్లవోలు గ్రామ పంచాయితీలో ది.01-04-2026 నుండి 31-03-2027 వరకు సంవత్సర కాలం కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయుటకు ఈ దిగువ పనులు చేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లు ది:16-03-2026 వ తేదీ మంగళవారం ఉదయం గం॥ 11.00 నుండి 2.00 గం॥ వరకు పంచాయితీ కార్యదర్శి వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గానీ స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం 2.30 గం॥లకు హాజరైన టెండరుదార్ల సమక్షములో తెరువబడును. టెండరు షరతులు ఇతర వివరములు కార్యాలయము పని చేయు వేళలందు తెలుసుకొనవచ్చును.

| వ.నెం | పని వివరము | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1) | పారిశుధ్య నిర్వహణ సిబ్బంది స్వీపర్లు - నలుగురు (4) | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.1000/- లేదా హామీ పత్రము |
| 2) | మంచినీటి సరఫరా నిర్వహణా పనులు - ముగ్గురు (3) | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.1000/- లేదా హామీ పత్రము |
| 3) | వీధి దీపముల నిర్వహణా పనులు - ముగ్గురు (3) | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.1000/- లేదా హామీ పత్రము |
| 4) | పారిశుధ్య ట్రాక్టరు డ్రైవరు - ఒకరు (1) | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.1000/- లేదా హామీ పత్రము |
| 5) | కంప్యూటర్ ఆపరేటర్ - ఒకరు (1) | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.1000/- లేదా హామీ పత్రము |

నోట్ :-
1. గతంలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
2. పంచాయితీ నిధుల నిల్వలను బట్టి వేతనములు చెల్లింపులు జరుపబడును.

**సం/- బొర్రా సాంబ శివయ్య**
**సర్పంచ్**
**మల్లవోలు గ్రామ పంచాయితీ**

**సం/- టి.వి.సుబ్రహ్మణ్యేశ్వరరావు**
**కార్యదర్శి**
**మల్లవోలు గ్రామ పంచాయితీ**

## గ్రామ పంచాయితీ కార్యాలయం, కోన
### టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి.నెం. /2026 తేది : 10-03-2026

కృష్ణాజిల్లా, మచిలీపట్నం మండలం, కోన గ్రామ పంచాయితీలో ది.01-04-2026 నుండి 31-03-2027 వరకు సంవత్సర కాలం కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయుటకు ఈ దిగువ పనులు చేయుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లు ది:16-03-2026 వ తేదీ మంగళవారం ఉదయం గం॥ 11.00 నుండి 2.00 గం॥ వరకు పంచాయితీ కార్యదర్శి వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గానీ స్వీకరించబడును. స్వీకరించిన టెండర్లు అదే రోజు మధ్యాహ్నం 2.30 గం॥లకు హాజరైన టెండరుదార్ల సమక్షములో తెరువబడును. టెండరు షరతులు ఇతర వివరములు కార్యాలయము పని చేయు వేళలందు తెలుసుకొనవచ్చును.

| వ.నెం | పని వివరము | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1) | పారిశుధ్య నిర్వహణ సిబ్బంది స్వీపర్లు - ఇద్దరు (2) | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.1000/- లేదా హామీ పత్రము |
| 2) | మంచినీటి సరఫరా నిర్వహణా పనులు - ఒకరు (1) | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.1000/- లేదా హామీ పత్రము |
| 3) | వీధి దీపముల నిర్వహణా పనులు - ఒకరు (1) | 01.04.2025 నుండి 31.03.2026 వరకు | రూ.1000/- లేదా హామీ పత్రము |

నోట్ :-
1. గతంలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
2. పంచాయితీ నిధుల నిల్వలను బట్టి వేతనములు చెల్లింపులు జరుపబడును.

**సం/- పెరుమళ్ళ నాగేశ్వరమ్మ**
**సర్పంచ్**
**కోన గ్రామ పంచాయితీ**

**సం/- రామవతు బాల**
**కార్యదర్శి**
**కోన గ్రామ పంచాయితీ**

## గ్రామ పంచాయితీ కార్యాలయం - మునగపాడు
**జి.కొండూరు మండలం, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్**
### టెండరు ప్రకటన

తేది : 11-03-2026

ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలం, మునగపాడు గ్రామ పంచాయతీ నందు ఈ దిగువ నుదహరించిన పనులు కాంట్రాక్టు పద్ధతిపై నిర్వహించుటకు గాను ఒక సంవత్సరమునకు అనగా ది.01-04-2026 నుండి 31-03-2027 వరకు సీల్డు టెండర్లు గ్రామ పంచాయితీ కార్యాలయము నందు ది.26-03-2026 సాయంత్రం గం.4.00ల వరకు స్వీకరించబడును. అదే రోజు సాయంత్రం 4.30 గంటలకు హాజరు కాబడిన టెండరుదారుల సమక్షంలో పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు తెరువబడును. ఇతర వివరములు కొరకు కార్యాలయము పనివేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

| వ.నెం | పని పేరు | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1) | ట్యాంకు ఆపరేటర్ నిర్వహణ పనులు ఒక వ్యక్తి (1) | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ. 1x500/- |
| 2) | వీధి దీపముల రిపేరు నిర్వహణ పనులు (ఎలక్ట్రిషియన్ ఒక వ్యక్తి) (1) | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ. 1x500/- |

నోట్ :-
1. గతంలో గ్రామ పంచాయితీ నందు పనిచేసి అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
2. గ్రామ పంచాయితీ నిధుల లభ్యతను బట్టి చెల్లింపులు జరుపబడును

**సం/- శ్రీ పగడాల వెంకటేశ్వరరావు**
**సర్పంచ్**
**గ్రామ పంచాయితీ , మునగపాడు**
**జి.కొండూరు మండలం**

**సం/- శ్రీ ఎల్.మనోజ్‌కుమార్**
**కార్యదర్శి**
**గ్రామ పంచాయితీ , మునగపాడు**
**జి.కొండూరు మండలం**

## గ్రామ పంచాయితీ కార్యాలయం - దుగ్గిరాలపాడు
**జి.కొండూరు మండలం, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్**
### టెండరు ప్రకటన

తేది : 11-03-2026

ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలం, దుగ్గిరాలపాడు గ్రామ పంచాయతీ నందు ఈ దిగువ నుదహరించిన పనులు కాంట్రాక్టు పద్ధతిపై నిర్వహించుటకు గాను ఒక సంవత్సరమునకు అనగా ది.01-04-2026 నుండి 31-03-2027 వరకు సీల్డు టెండర్లు గ్రామ పంచాయితీ కార్యాలయము నందు ది.25-03-2026 ఉదయం గం.10.00ల వరకు స్వీకరించబడును. అదే రోజు ఉదయం 12.30 గంటలకు హాజరు కాబడిన టెండరుదారుల సమక్షంలో పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు తెరువబడును. ఇతర వివరములు కొరకు కార్యాలయము పనివేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

| వ.నెం | పని పేరు | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1) | ట్యాంకు ఆపరేటర్ నిర్వహణ పనులు ఒక వ్యక్తి (1) | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ. 1x500/- |
| 2) | వీధి దీపముల రిపేరు నిర్వహణ పనులు (ఎలక్ట్రిషియన్ ఒక వ్యక్తి) (1) | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ. 1x500/- |

నోట్ :-
1. గతంలో గ్రామ పంచాయితీ నందు పనిచేసి అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
2. గ్రామ పంచాయితీ నిధుల లభ్యతను బట్టి చెల్లింపులు జరుపబడును

**సం/- శ్రీ జడ రాంబాబు**
**సర్పంచ్**
**గ్రామ పంచాయితీ , దుగ్గిరాలపాడు**
**జి.కొండూరు మండలం**

**సం/- శ్రీ ఎల్.మనోజ్‌కుమార్**
**కార్యదర్శి**
**గ్రామ పంచాయితీ , దుగ్గిరాలపాడు**
**జి.కొండూరు మండలం**

## గ్రామ పంచాయితీ కార్యాలయం - తెల్లదేవరప్పాడు
**జి.కొండూరు మండలం, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్**
### టెండరు ప్రకటన

తేది : 11-03-2026

ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలం, తెల్లదేవరప్పాడు గ్రామ పంచాయతీ నందు ఈ దిగువ నుదహరించిన పనులు కాంట్రాక్టు పద్ధతిపై నిర్వహించుటకు గాను ఒక సంవత్సరమునకు అనగా ది.01-04-2026 నుండి 31-03-2027 వరకు సీల్డు టెండర్లు గ్రామ పంచాయితీ కార్యాలయము నందు ది.25-03-2026 మధ్యాహ్నం గం.2.00ల వరకు స్వీకరించబడును. అదే రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు హాజరు కాబడిన టెండరుదారుల సమక్షంలో పంచాయితీ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు తెరువబడును. ఇతర వివరములు కొరకు కార్యాలయము పనివేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

| వ.నెం | పని పేరు | కాల పరిమితి | ధరావత్తు |
|---|---|---|---|
| 1) | ట్యాంకు ఆపరేటర్ నిర్వహణ పనులు ఒక వ్యక్తి (1) | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ. 1x500/- |
| 2) | వీధి దీపముల రిపేరు నిర్వహణ పనులు (ఎలక్ట్రిషియన్ ఒక వ్యక్తి) (1) | 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ. 1x500/- |

నోట్ :-
1. గతంలో గ్రామ పంచాయితీ నందు పనిచేసి అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
2. గ్రామ పంచాయితీ నిధుల లభ్యతను బట్టి చెల్లింపులు జరుపబడును

**సం/- శ్రీ ఉమ్మడి ప్రసాద్**
**సర్పంచ్**
**గ్రామ పంచాయితీ , తెల్లదేవరప్పాడు**
**జి.కొండూరు మండలం**

**సం/- శ్రీ ఎల్.మనోజ్‌కుమార్**
**కార్యదర్శి**
**గ్రామ పంచాయితీ , తెల్లదేవరప్పాడు**
**జి.కొండూరు మండలం**

# ఆస్తి, నీటి పన్ను వసూళ్లు వేగవంతం చేయండి - డి ఎల్ డి వో నిర్మల జ్యోతి

● మొండి బకాయిలను సైతం వదలొద్దు ●జి.కొండూరు గ్రామంలో ఆస్తి, నీటి పన్ను వసూళ్లలో పాల్గొన్న డి ఎల్ డి వో నిర్మల జ్యోతి





**జి.కొండూరు,మార్చి 10 (వార్తాప్రభ) :** ఆస్తి, నీటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని డివిజినల్ డెవలప్మెంట్ అధికారి(డి ఎల్ డి వొ)నిర్మల జ్యోతి స్థానిక పంచాయితీ రాజ్ శాఖ అధికారులకు సూచించా రు.మండల కేంద్రమైన జి.కొండూరు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించి ఎంపీడీవో బి.వి.రామకృష్ణ నాయక్, ఇంచార్జ్ డిప్యూటీ ఎంపీడీవో ఏటుకూరి బసవలింగేశ్వరరావు తో సమావేశమై గ్రామంలో ఆస్తి, నీటి పన్ను వసూళ్లపై చర్చించారు.ఈ సందర్భంగా నిర్మల జ్యోతి మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నూటికి నూరు శాతం ఇంటి పన్ను వసూళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు.అధికారులు డోర్ టూ డోర్ వెళ్లి ప్రాపర్టీ, వాటర్ టాక్స్ వసూళ్లు చేయాలన్నారు.వసూళ్లలో ప్రతి రోజు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. ముఖ్యంగా మొండి బకాయిలపై దృష్టి పెట్టాలని సూచించారు. నోటీసులు ఇచ్చిన వినని వారి ప్రాపర్టీపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా ఇంటి పన్ను సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఆమె గ్రామస్తులను కోరారు. స్థానిక మండల వెలుగు కార్యాలయాన్ని సందర్శించి వెలుగు సిసి లతో సమావేశమయ్యా రు. డ్వాక్రా సంఘాలకు ప్రత్యేకంగా రూ.10 వేలు రుణాలు ఇచ్చినట్లయితే మహిళలు ఇంటి పన్ను కట్టేందుకు వెసులుబాటుగా ఉంటుందని, నెలవారి వాయిదాలలో ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్మల జ్యోతి పేర్కొన్నారు.అనంతరం ఆమె గ్రామంలో కొందరిచేత ఇంటి పన్ను కట్టించుకున్నారు.

## గ్రామ పంచాయితీ కార్యాలయం - A. సీతారామపురం
**బాపులపాడు మండలం, కృష్ణా జిల్లా**
### టెండరు ప్రకటన

తేది. 11.03.2026.

కృష్ణా జిల్లా, బాపులపాడు మండలం, A.సీతారామపురం గ్రామ పంచాయితీలో 2026-2027 సంవత్సరమునకు ఈ దిగువ తెలిపిన ప్రకారం. కాంట్రాక్టు పద్ధతిపై వినియోగించుటకు గాను ది.26-03-2026 తేది ఉదయం 10.30 గం॥ నుండి 11.30 వరకు సీల్డు టెండర్లు గ్రామ పంచాయతీ కార్యాలయం నందు పంచాయతీ కార్యదర్శిచే గాని లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని స్వీకరించబడును. దాఖలు కాబడిన టెండర్లు అదేరోజు మధ్యాహ్నం 12.00 గంటలకు హాజరైన టెండరు దార్ల సమక్షంలో టెండర్లు తెరువబడును. ఇతర వివరములు కార్యాలయపు పనివేళల్లో తెలుసుకొనవచ్చును.

| వ. సంఖ్య | పని పేరు | పని చేయు కాలము |
|---|---|---|
| 1) | ట్యాంక్ ఆపరేటర్లు-2 | 01.04.2026 నుండి 31.03.2027 వరకు |
| 2) | స్వీపర్లు -2 | 01.04.2026 నుండి 31.03.2027 వరకు |
| 3) | ఎలక్ట్రీషియన్-1 | 01.04.2026 నుండి 31.03.2027 వరకు |

నోట్ :-
1. గతంలో గ్రామ పంచాయితీలో పని చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును.
2. పంచాయితీ నిధులు నిల్వలను బట్టి చెల్లింపులు చేయబడును.
3. డిపాజిట్ 1000/- లేదా హామీ పత్రము సమర్పించవలెను

**సం/- శ్రీ బొరపురెడ్డి గణేష్ కుమార్**
**సర్పంచ్**
**గ్రామ పంచాయతీ, A.సీతారామపురం**
**బాపులపాడు మండలం.**

**సం/- శ్రీ సిహెచ్.శ్రీనివాసరావు**
**కార్యదర్శి**
**గ్రామ పంచాయతీ, A.సీతారామపురం**
**బాపులపాడు మండలం.**

# రోడ్డు భద్రత నియమాలు పాటించండి

● రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవ్ ● హెల్మెట్లు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా రోడ్లపైకి వస్తే వాహనాలు సీజ్ చేస్తాం ● మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దు.అలా ఇస్తే వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తాం ● జి.కొండూరు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ కె.సతీష్ కుమార్



**జి.కొండూరు,మార్చి 10 (వార్తాప్రభ) :** రోడ్డు భద్రత నియమాలు తప్పని సరిగా పాటించాలని,రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని జి కొండూరు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ కె.సతీష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం సతీష్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు.దీనికి కారణం వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించకపోవటమేనని అన్నారు.మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వొద్దని,అలా ఇస్తే వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా నిబంధనలు పాటించని వాహన చోదకులపై పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. దీనిలో భాగంగా మంగళవారం జి.కొండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నిబంధనలు పాటించకుం డా రోడ్లపైకి వస్తున్న వాహందారులపై కఠిన చర్యలకు ఉపక్రమించారు. హెల్మెట్లు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, సెల్ఫోన్ డ్రైవింగ్, ఇతర ధ్రువపత్రాలు లేకపోవడం, ప్రమాదకరంగా రోడ్ సైడ్ పార్కింగ్ మొదలైన రోడ్డు భద్రత నియమాలు ఉల్లంఘిస్తూ యాక్సిడెంట్లు కారణమవుతున్న వాహనదారుల పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.ఈ డ్రైవ్ లో 10 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు సహకరించాలని, లేనియెడల పోలీసు తాము తీసుకునే కఠినమైన చర్యలకు బాధ్యులు అవుతారని అన్నారు.

# పార్టీ పటిష్టతకు నూతన కమిటీ కృషి చేయాలి

-సూచించిన టిడిపి అగ్ర నాయకులు



**పెడన,మార్చి 10 (వార్తాప్రభ) :** ఏర్పడిన టిడిపి మండల కమిటీ పార్టీ ప్రతిష్టకు కృషి చేయాలని పలువురు అగ్ర నాయకులు అన్నారు. నూతన కమిటీ ప్రమాణస్వీకారం గూడూరులో జరిగింది. ఈ సందర్భంగా శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వీరికి గురుమూర్తి మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని విజయ పదాన నడిపించేం దుకు మండల కమిటీ కృషి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లి విధంగా కమిటీ పని చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన కమిటీ ప్రతినిధులను నాయకులు అభినందించి సత్కరించారు. అధ్యక్షునిగా గోపి నాగబాబు ప్రధాన కార్యదర్శిగా తోట వేణు ఇంకాపలువురు నాయకులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో కొనకల్ల జగన్నాథ రావు( బుల్లయ్య ) గోపు సత్యనారాయణ బొడ్డు వేణుగోపాల్ రావు అర్జా నగేష్ సలపాటి ప్రసాద్ కాసగాని శ్రీనివాస్ రావు అన్నం హరి రామకృష్ణ పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# నాగబాబు భుజస్కందాల పై పెద్ద బాధ్యత

-స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యం...?



**పెడన,మార్చి 10 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం గూడూరు మండల టీడీపీ నూతన టిడిపి కమిటీ కొలువుదీరింది. 24 సంవత్సరాల పాటు మండల శాఖకు ఎస్సీ సెల్ ఉపాధ్యక్షునిగా పనిచేసిన గోపి నాగబాబు అధ్యక్షునిగా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఆకుమర్రు గ్రామ సర్పంచి గానే కాకుండా జిల్లాస్థాయిలో రాష్ట్రస్థాయిలో కూడా నాగబాబు పలు పార్టీ పదవులను అలంకరించారు. సబ్జెక్టు వైజ్ గా మాట్లాడే ఆయన వాక్చటిమను గుర్తించిన శాసనసభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్ ఆయన భుజస్కందాల మీద పెద్ద బాధ్యతనే పెట్టారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల ను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా స్పష్టమవుతుంది. ఇక్కడ స్వపక్షంలోనే విపక్షం కూడా ఉంది. ఈ తలనొప్పులను కూడా తట్టుకుని నాగబాబు ముందుకు వెళ్ళవలసి ఉంటుంది. స్వతహాగా మృదు స్వభావి అయిన నూతన అధ్యక్షుడు అందరిని కలుపుకుని పోయే మనస్తత్వం కలవాడిగానే పేరుంది.

# బాణసంచా తయారీలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు - జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

● జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడుతో కలిసి కృత్తివెన్ను మండలంలో విస్తృత తనిఖీలు చేపట్టిన జిల్లా కలెక్టర్



**కృత్తివెన్ను,మార్చి 10 (వార్తాప్రభ) :** అనుమతులు లేకుండా బాణసంచా తయారీ కేంద్రాలు నిర్వహించినా, అనుమతులు పొంది తయారీలో నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి హెచ్చరించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ కృత్తివెన్ను మండలంలోని పలు బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాల్లో జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బందితో కలిసి విస్తృతంగా తనిఖీలు చేశారు. మండలంలోని పడతడిక, చినగొల్లపాలెం, నిడమర్రు గ్రామాలలో బాణసంచా తయారీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. తయారీ కేంద్రాలలో సరైన లైసెన్సులు, ఫైర్ సేఫ్టీ ఎక్విప్‌మెంట్, నిల్వ పరిమితులు ఉన్నాయో లేదో తనిఖీ చేశారు. షెడ్లలో పరిమితికి మించి పేలుడు పదార్థాలు నిల్వ చేయకుండా చూడటం, మిక్సింగ్, ఫిల్లింగ్, ప్యాకింగ్ ఎండబెట్టే విభాగాలు నిబంధనల ప్రకారం నిర్ణీత దూరంలో ఉన్నాయా లేదా అని, అదేవిధంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా ఎర్తింగ్ తదితర సౌకర్యాలు ఉన్నాయోలేదో పరిశీలించారు. శిక్షణ పొందిన వ్యక్తులే పని చేస్తున్నారా, బాలకార్మికులు ఉన్నారా తదితర వివరాలను ఆరా తీశారు. అగ్నిమాపక పరికరాల లభ్యత, ఎగ్జిట్ పాయింట్లు, పొగతాగడంపై నిషేధం వంటి భద్రతా ప్రమాణాలను తనిఖీ చేశారు. కూలీల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించేది లేదని చెబుతూ బాణసంచా తయారీలో చిన్నారులను ఎట్టి పరిస్థితుల్ల నియమించుకోవద్దని హెచ్చరించారు. బందరు ఆర్డీవో కే సాంబశివరావు, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి ఏసురత్నం, తహసిల్దారు శశి కుమార్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# మినుము మద్దతు ధర రూ.7,800....




**గుడ్లవల్లేరు,మార్చి 10 (వార్తాప్రభ) :** మినుము మద్దతు ధర రూ.7,800తో డీసీఎంఎస్ ద్వారా రైతుల నుంచి కొనుగోళు చేస్తున్నామని గుడ్లవల్లేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మినుము కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రస్తుత రబీ సీజన్లో రైతులు సాగు చేసిన మినుము పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయుటకు గాను డీసీఎంఎస్ ద్వారా మినుము కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఏఎంసీ చైర్మన్ రవికుమార్ అన్నారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసువాలని కోరారు. ప్రభుత్వ కనీస మద్దతు ధర మినుముకు రూ.7,800 క్వింటాకు కేటాయిస్తే, పెసలు మద్దతు ధర రూ.8,768 క్వింటాకు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రారంభ కార్యక్రమములో మండల వ్యవసాయ అధికారి ఎల్.సునీల్, గుడ్లవల్లేరు పీఏసీఎస్ చైర్మన్ వెనిగళ్ళ నాగేశ్వరరావు, రైతులు వల్లభనేని రంగబాబు, వల్లూరుపల్లి వెంకటేశ్వరరావు, అల్లూరి వాసు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి సేద్యం పై చెన్నూరు జడ్పీ స్కూల్ విద్యార్థులకు అవగాహన ర్యాలీ



**పెడన,మార్చి 10 (వార్తాప్రభ) :** ఆధునిక వ్యవసాయం సాగుతో పురుగు మందుల అవశేషాలు తగ్గించి ప్రకృతి సేద్యం చేయటం వలన ఖర్చు తగ్గి ఆదాయం పెరిగి ఆరోగ్యమైన ఆహారాన్ని పొందవచ్చు అని మోడల్ మాస్టర్ ట్రైనర్ ఓ.స్వామి బాబు అన్నారు పెడన మండలం, చెన్నూరు ఆర్ ఎస్ కె అధ్వర్యం లో జిల్లా పరిషత్ హై స్కూల్ నందు రైతులకు పాఠశాల పిల్లలకు ప్రకృతి సేద్యం పై మంగళవారం నాడు అవగాహన కల్పించారు. రానున్న ఖరీఫ్ సీజన్ కంటె ముందు పచ్చి రొట్ట తోపాటు నవ దాన్యలు సాగు చేయలని తద్వార భూమిలో సూక్ష్మజీవులు పోషకాలను వృద్ధి చెంది పంటకు కావాల్సిన పోషకాలను అందిస్తాయనీ ప్రతి కుటుంబం లోని కానిసం వారి కుటుంబానికి సరిపడా విస్తీర్ణంలో ప్రకృతి సేద్యం చేయలని దశల వారిగా ప్రకృతి వ్యవసాయ ఆహారాన్ని అందరికి అందించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు పి .శ్రీనివాస్ కె .వెంకటేశ్వరావు డి .రాంబాబు ఎం పద్మజ పి పవన్ ,సి హెచ్ .రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

# యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వరలక్ష్మి ఎగ్జామ్ కిట్స్ వితరణ....



**గుడ్లవల్లేరు,మార్చి 10 (వార్తాప్రభ) :** టెన్త్ విద్యార్థులకు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఏవీ వరలక్ష్మి అంగలూరు ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 81మంది విద్యార్థునులకు ఫైనల్ పరీక్షలు సందర్భంగా సుమారు రూ.8వేల పైగా విలువైన ఎగ్జామ్ కిట్స్‌ను టెన్త్ విద్యార్థులకు మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ -- 2 శ్రీ జి.గోపాలరావు, యూటీఫ్ మండల అధ్యక్షుడు డివిఎం రామకష్ణ ప్రధాన కార్యదర్శి కె.వెంకటరావు, మండల గౌరవ అధ్యక్షుడు ఎం.ఆరోగ్యం, జిల్లా కార్యవర్గ సభ్యులు కలపాల రత్నం, విరజ, మాజీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, వి.రామకష,?ణ పేతురు, బి.నాంచారయ్య, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188